# ధర్మో..రక్షతి..రక్షితః

- సనాతన ధర్మ పరిరక్షణకు ఐక్యంగా కదులుదాం....
- నమో నారాయణాయ: ఎమ్మెల్యే పంతం నానాజీ




**కాకినాడ రూరల్,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ శ్రీ శ్రీ తిరుమల తిరుపతి పవిత్ర ప్రసాదం (లడ్డు) తయారీలో జరిగిన నెయ్యి అవతకవతలపై 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన దీక్షకు సంఘీభావంగా కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు పంతం నానాజీ సతి సమేతంగా కాకినాడ గొడారిగుంట, లక్ష్మి ఆసుపత్రి నందు “ఓం నమో నారాయణాయ మంత్ర పఠనం” కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి వందలాది వేద పండితులు,కలియుగ దైవం శ్రీ శ్రీ తిరుమల తిరుపతి దేవస్థాన వేద పండితులు ప్రత్యేకంగ పాల్గొని ఆశీర్వాదం అందించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులందరికి పంతం నానాజీ సతి సమేతంగా ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెదేపా, భాజపాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు,జన సైనికులు,వీర మహిళలు,శ్రేణులు, రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గ,మండల, గ్రామ స్థాయి నాయకులు,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మైలవరం బస్టాండ్ లో స్వచ్ఛత హీ సేవ




**మైలవరం,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : కేంద్ర ప్రభుత్వ ఆదేశాలమేర కు రీజనల్ డైరెక్టర్ ఎన్ ఎస్ ఎస్ హైదరాబాద్ వారి ఉత్తర్వులు అనుసరించి స్థానిక డాక్టర్ ఎల్ హెచ్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గత నెల 17 వ తేదీ నుంచి “స్వచ్ఛత హీ సేవ” కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగముగా మంగళవారం మైలవరం బస్టాండ్ ఆవరణలో ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు మరియు ఇతర వ్యర్థములను సేకరించే కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాల ను మైలవరం గ్రామపంచాయతీ సిబ్బందికి అందజేశారు. వాలంటీర్లు సేవలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇల్ల రవి కొనియాడారు. ఇటువంటి సేవ స్వభావము విద్యార్థిని విద్యార్థులు అందరూ భవిష్యత్తులో కూడా కొనసాగించవల సినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి. ఫణి కుమార్, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ మేజర్ మన్నే స్వామి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



**వీరులపాడు,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : జయంతి గ్రామం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం లో సచివాలయం సిబ్బంది తోపాటు టిడిపి జనసేన కూటమి ప్రభుత్వం లో మాజీ సర్పంచ్ గువ్వల సత్యనారాయణ, చిలక ప్రభాకర్ రావు, షేక్ పకీరయ్య, షేక్ మొగ్లీ, పడిగల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# చల్లపల్లి స్టేట్ బ్యాంకు సిబ్బంది నిజాయితీ



**చల్లపల్లి: అవనిగడ్డ,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : ఆదమరిచి ఏటిఎం మిషన్ లో నగదు వదిలేసిన సొమ్ము ను బ్యాంకు సిబ్బంది భద్రంగా ఖాతా దారునికి అందించిన వైనమిది. ఖాతా దారులతో పాటు స్థానికుల మన్ననలం దుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చల్లపల్లి స్టేట్ బ్యాంకులో మంగళవారం రామానగరం కు చెందిన రాజారావు అనే ఖాతా దారుడు బ్యాంకు ఆవరణలో ఉన్న ఏ టీ ఎం మిషన్ లో డెబిట్ కార్డు ద్వారా నగదు విత్ డ్రా చేసి అదమరచి ఏడు వేల రూపాయల నగదును మిషన్లో వదిలి వెళ్ళిపోయాడు. ఇది గమనించిన బ్యాంకు సెక్యూరిటీ గార్డు వేసపోగు డేవిడ్ ఆ మొత్తాన్ని బ్రాంచ్ మేనేజర్ వి.భారతి కి అప్పగించి జరిగిన విషయం వివరించాడు. వెంటనే స్పందించిన మేనేజర్ వి .బారతి సి సి కెమెరాలను పరిశీలించి ఖాతా దారుడిని గుర్తించి నగదును రాజారావుకు అప్పగించారు. విధి నిర్వహణలో నిజాయితీ చాటుకున్న సెక్యూరిటీ గార్డు డేవిడ్ ను బ్రాంచ్ మేనేజర్ భారతి , సిబ్బంది అభినందించారు. ఆదమరుపుతో చేజారిన తన రెక్కల కష్టాన్ని బాధ్యతగా నిజాయితీతో తనకందించిన బ్యాంకు అధికారులకు, సిబ్బందికి ఖాతాదారుడు రాజారావు కృతజ్ఞతలు తెలిపాడు.

# దావు ప్రమీలకు నివాళులర్పించిన వైసీపీ నేతలు



**కోడూరు,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : కోడూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు దావు చిన్నబాబు మాతృమూర్తి దావు ప్రమీల మృతి చెందారు. ఆమె యొక్క భౌతికాయానికి కోడూరు మండల వైఎస్ఆర్సిపి నేతలు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, వైసీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ సభ్యులు బడే హేమగంగాధర్ రావు, వార్డ్ మెంబర్ వెన్న ప్రసాద్, దావు శివకృష్ణ తదితరులు ప్రమీలకు నివాళులర్పించారు.



**ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేస్తున్న టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లమల ఉమామహేశ్వరరావు, టిడిపి సెక్రెటరీ సుంకర నాగశేషు మరియు సచివాలయం సిబ్బంది**

-వీరులపాడు,అక్టోబరు 1 (వార్తాప్రభ)

# అమ్మవారి నవరాత్రుల పూజలు ఘనంగా ప్రారంభం

- ఆలయ కమిటీ అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ వెల్లడి



**హైదరాబాద్,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : నేతాజీ నగర్ కాలనీలో శ్రీ భగవత్ రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవార్లకి దసరా నవరాత్రుల పూజలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ తెలిపారు. భక్తులు ఈ దసరా సందర్భంగా నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకొని పూజలు ఘనంగా నిర్వహించుకోవాలని అమ్మవారి కరుణ కటాక్షం పొందాలని కోరుతున్నాము అన్నారు. ఆలయంలో పంతులు ఉదయం ఏడు గంటల నుండి 10 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల వరకు అర్చకులు పూజారి సంతోష్ శర్మ గుడి పూజారి అందుబాటులో ఉంటారన్నారు. వారి ఫోన్ నెంబర్ o917013452644 అని, దసరా నవరాత్రులు సందర్భంగా శ్రీ భగవత్ రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహహిస్తారన్నారు. కాబట్టి భక్తులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కరుణాకటాక్షాలు పొందగలరని కో ఆలయ కమిటీ అధ్యక్షులు భేరి రామ్ చందర్ లియాదవ్(సెల్ 8978999896) ఆలయ కమిటీ సభ్యులు రాఘవేంద్ర శర్మ, రాయుడు, మణికంఠ, కే నరసింహ యాదవ్, బుచ్చయ్య యాదవ్, తెలుగు సుభాష్ ముదిరాజ్, సత్యనారాయణ ముదిరాజ్, సత్యమ్మ, పుష్ప రెడ్డి, రాధా రాణి రెడ్డి, జయ రెడ్డి, అంజిరెడ్డి, చిట్టెమ్మ లాల్ రెడ్డి, అన్నదొర, బాలరాజ్ నాయక్, సౌజన్య, శారద, రవి నాయక్, వెంకటేష్ ముదిరాజ్, భవాని గణేష్, కుమార్ నాయక్, ధన శేఖర్ నాయక్, బాలాజీ నాయక్, వెంకన్న, కే రాము యాదవ్, బాలరాజు ముదిరాజ్, అంకంరావు మేస్త్రి, పెద్ద శ్రీనివాస్ మేస్త్రి, శ్రీకాంత్, నరేందర్ నాయక్, రవి మేస్త్రి, అశోక్ నాయక్, సురేష్ నాయక్, మార్వాడి శంకర్, గ్యాస్ వేణు, శ్రీకాంత్ రెడ్డి, వాసు, యూత్ ప్రెసిడెంట్ డీజే భవన్, రాజు, భేరి శ్రీనివాస్ యాదవ్, లవణాచారి, యాదగిరి సాగర్, సంజీవ, దయాకర్ సాగర్, యాదగిరి యాదవ్, గిరి నాయక్ లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నేతాజీ నగర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళా సంఘం నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైన లక్ష్య స్కూల్ విద్యార్థులు..

- చదువుతోపాటు ఆటలో రాణిస్తున్న లక్ష్య స్కూల్ విద్యార్థులు
- విద్యార్థులను అభినందించిన లక్ష్య స్కూల్ యాజమాన్యం



**కోడూరు,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : గత నాలుగు రోజుల నుండి అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ జిల్లా స్థాయికి ఎంపిక పోటీలు జరుగుతున్నాయి. కోడూరు లోని ప్రముఖ విద్యా సంస్థ అయినటువంటి లక్ష్య స్కూల్ విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో సత్తా చాటి జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు లక్ష్య స్కూల్ కరస్పాండెంట్ విస్సంశెట్టి శివ నాగరాజు తెలిపారు. మంగళవారం నాడు స్థానిక పాఠశాల వద్ద ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆటల పోటీల్లో లక్ష్య స్కూల్ విద్యార్థులు ఖోఖో, కబడ్డీ , వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, అదల్టిక్స్ అయినటువంటి 100 మీటర్స్ లో లక్ష్య స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్కూల్ నుండి 16మందివిద్యార్థులు, మరొకరు ఐదుగురు విద్యార్థులు స్టాండ్ బై ప్లేయర్స్ గా లక్ష్య స్కూల్ నుండి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అండర్ 14 విభాగం ఖో ఖో లో కోలా లోకేష్, సిహెచ్ ప్రవీణ్ పాల్, కబడ్డీ విభాగంలో పి అయ్యప్ప,పి డానియల్ , వాలీబాల్ విభాగంలో పి అయ్యప్ప, డేనియల్, జి సాయిరాం, కె లోకేష్, షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో కోలా లోకేష్ మొదటి స్థానాన్ని, కృష్ణ ఐదో స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు, అండర్ 14 బాలికల భాగంలో కబడ్డీ లో పి జ్యోత్స్న , ఖో ఖో లో జి రేష్మ, నందిని, అలేఖ్య ఎంపికైనట్లు, అండర్ 17 సీనియర్ విభాగంలో ఖోఖో లో గాదె అక్షయ, గాయత్రి,కబడ్డీలో జె కావ్య, బ్యాడ్మింటన్ విభాగంలో గాదె అక్షయ మొదటి స్థానాన్ని పొంది జిల్లా స్థాయికి ఎంపిక అయినట్లు ఆయన అన్నారు. జిల్లాస్థాయికు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ వి శివ నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు శొంతి గంగాధర రావు తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

# నిర్వహణా గ్రాంట్స్ మంజూరుకు ఎస్పీడి సానుకూల స్పందన

- ఎంఈఓ -1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం హర్షం



**విజయవాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ (గ్రాంట్స్) మంజూరు చేసేందుకు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి శ్రీనివాస రావు సానుకూలంగా స్పందించడం పట్ల ఎంఈవో 1-అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ నిధులు మంజూరు కాకపోవడంతో ఎంఈఓ లు ఇబ్బందులు పడుతున్నారని, సోమవారం జరిగిన విద్యాశాఖ స్టేట్ వెబెక్స్ సమావేశంలో ఎంఈవో -1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఎస్పిడి కి విజ్ఞప్తి చేయగా, నిధులు మంజూరు చేసేందుకు ఎస్పీడి హామీ ఇచ్చారన్నారు. గ్రాంట్స్ విషయంలో సానుకూలంగా స్పందించిన ఎస్పిడి కి ఎంఈవో -1 అసోసియేషన్ పక్షాన ధన్యవాదాలు తెలియచేస్తున్నామని రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి బి రవి నాయక్ పేర్కొన్నారు.

# ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించిన ప్రజా సంకల్ప వేదిక




**గిద్దలూరు టౌన్,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షులు మదిరె రంగ సాయి రెడ్డి ఆదేశాల మే-రకు జిల్లా అధ్యక్షులు ఓబిలిబోయిన వెంకటయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు అడపాల నాగమణి, జిల్లా మాజీ సైనికులు విభాగం అధ్యక్షులు బట్టబోతుల ఓబులేసు అధ్యక్షతన గిద్దలూరు ప్రజా సంకల్ప వేదిక కార్యాలయంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సమాజ శ్రేయస్సు కొరకు కృషి చేస్తున్న వృద్ధులకు ఆత్మీయ సన్మానం చేసి, సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్న వృద్ధుల పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలని, వారి అనుభవ పూర్వకమైన సలహాలు భావి తరాల వారికి ఎంతో అమూల్యమైనవని పలువురు వక్తలు తెలిపారు. 139 బీసీ కులాల జె.ఎ.సి. రాష్ట్ర ఉపాధ్యక్షులు గా ఇటీవల నియామకం కాబడిన ప్రజా సంకల్ప వేదిక గౌరవ సలహాదారులు జంగాల బాలయ్య యాదవ్ కి ప్రత్యేక సన్మానం చేయడం జరిగింది. న్యాయ సేవా సాధికార సంస్థల ద్వారా వృద్ధులు కోర్ట్ లో ఉచిత న్యాయ సహాయం పొందే వీలుంటుందని జిల్లా అధ్యక్షులు ఓ వెంకటయ్య తెలిపారు.

# 97% ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీ - ఎంపీడీవో ఎస్ వెంకటరమణ



**విస్సన్నపేట,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : స్థానిక మండలంలో 15 సచివాలయాల పరిధిలో 11 గ్రామ పంచాయతీలలో 97% ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను మొదటి రోజే పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో ఎస్ వెంకటరమణ తెలిపారు. మూడు 3,43 ,65,5,000 కోట్ల రూపాయలు 82 46 మంది పింఛన్దారులకు మంజూరైనట్లు చెప్పారు.

# పంట నష్టం నమోదుకు మరో అవకాశం - ఏవో జి.సాయిసింధు

**చల్లపల్లి / అవనిగడ్డ,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : ఆకాల వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పంట నష్టం వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పించినట్లు చల్లపల్లి మండల వ్యవసాయశాఖ అధికారిణి జి. సాయిసింధు తెలిపారు. గ్రామాల్లో పంట నష్టం జరిగి నష్టపరిహారం అందని వారు, స్థానికంగా తమపేరు నమోదు చేయలేదని అభ్యంతరాలు వ్యక్తం చేసే రైతులు గ్రామ వ్యవసాయ సంచాలకులకు(వీఏఏ) మ-రోసారి తమ వివరాలు అందించాలని కోరారు. ఈ నెల మూడవ తేదీ వరకు పంట నష్టం వివరాలు నమోదుకు అవకాశం ఉందన్నారు. చల్లపల్లి మండలం మాజేరులో ప్రత్యేక బృందం పర్యటించి రైతుల అభ్యంతరాలపై పరిశీలన చేసి అర్హులైన రైతుల వివరాలు నమోదు చేస్తారన్నారు.

# ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే ఘనత కూటమి ప్రభుత్వానిది

- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే ఘనత కూటమి ప్రభుత్వానిదే అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 21వ డివిజన్ నందు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే ఘనత కూటమి ప్రభుత్వానిదని,ప్రతి నెల ఒకటవ తేదీన ఉదయం 5 గంటలకు మొదలై 9 గంటలకు కాకినాడ నియోజకవర్గం నందు 90% పంపిణీ పూర్తి చేయడం జరిగిందని,రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ కూడా పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ప్రతి నెల ఒకటవ తేదీన లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేయడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో అర్హులైన వారికి నూతన పెన్షన్లు అందించడం కూడా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు తెప్పల రామలింగేశ్వరరావు, బూడి ప్రకాష్, దుర్గాప్రసాద్, ఆయేషా, గౌరుసు దుర్గారావు, పసగడుగుల శేషగిరిరావు,అన్వర్, ఇమామ్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

# నూర్ భాషా సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా షేక్.బాబు



**మైలవరం,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : ఎన్టీఆర్ జిల్లా నూర్ భాషా మరియు దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా జి.కొండూరు గ్రామానికి చెందిన షేక్. బాబు నియమితులయ్యారు. మైలవరం పట్టణంలో మంగళవారం సంఘం కార్యవర్గ ఎన్నిక జరిగింది. నూర్ భాషా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు షేక్.కాజా రహంతుల్లా, కార్యదర్శి షేక్ ఖాసిం షరీఫ్ లు షేక్.బాబు ను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు వారుతెలిపారు. అలాగే జి.కొండూరు మండల నూర్ భాషా సంక్షేమ సంఘం అధ్యక్షులుగా షేక్.కొండబాబు ను కూడా ఏకగ్రీవంగా నియమించారు. వీరంతా నూర్ భాషా మరియు దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని వారు పేర్కొన్నారు. నీతి నిజాయితీ అంకితభావం క్రమశిక్షణతో సంఘం సంక్షేమానికి పటిష్టకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా షేక్. బాబు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతు న్నానని, సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేసిన ఎంఎల్ఏ

- సి ఎం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెల ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్లు
- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య నాయకత్వంలో స్థానిక ఎన్డీయే కూటమి నాయకులు మంగళవారం పండుగలా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఎన్టీఆర్ భోరోసా పింఛన్ల పంపిణీ లోభాగంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పట్టణంలోని 15,16 వార్డు సచివాలయాల పరిధిలో పర్యటించి, ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను తూ.చ. తప్పకుండా నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. ఒకటో తేదీ తెల్లవారి ఆరు గంటలకే పెంచిన పింఛను రూ.4000 ఇంటి వద్దే అందుకున్న అవ్వాతాతల మోముల్లో చిరునవ్వులే మా కూటమి ప్రభుత్వానికి దీవెనలు అన్నారు. పింఛన్లు అందుకున్న ఒంటరి మహిళలు, దివ్యాంగులు చెబుతున్న కృతజ్ఞతలే కూటమి ప్రభుత్వానికి ఆశీస్సులు అని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందుకున్న లక్షలాదిమంది వ్యక్తం చేసిన ఆనందమే కూటమి ప్రభుత్వానికి అందిన వెలకట్టలేని బహుమానమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక కూమటి నేతలు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతాం

- మధ్యాహ్న భోజనం వర్కర్స్ జిల్లా యూనియన్ కమిటీ




**నందిగామ,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : విద్యా కమిటీలు కానీవ్వండి ఎస్ఎంఎస్ కమిటీ లు కానీయండి స్కూల్ డెవలప్మెంట్ కోసం కాకుండా వాళ్ళు వచ్చిన దగ్గర్నుంచి మధ్యాహ్న భోజన పథకం కార్మికులనే తీసివేయటానికి వాళ్ళు తీర్మానాలు చేయడానికి మాత్రమే కమిటీలు దృష్టిపెట్టాయని ఆంధ్ర ప్రదేశ్ మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సి హెచ్ సుప్రజ దుయ్యబట్టారు. సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో మధ్యాహ్న కార్యక్రమం భోజన కార్మికులు చేపట్టిన దీక్ష రెండో రోజు శిబిరాన్ని సుప్రజా సందర్శించారు. ఈ సందర్భంగా సుప్రజ మాట్లాడుతూ కమిటీల ద్వారా మన మెనూ ఏ విధంగా అమలు చేద్దాం అనే ఆలోచనలన్నీ ప్రభుత్వం పక్కన పెట్టీ కార్మికులను ఏ విధంగా తొలగించాలా అనే దానిపై దృష్టి పెట్టిందన్నారు. దీనిని మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నాం. కాబట్టి తొలగించిన కార్మికుల వెంటనే విధుల్లో కార్మికులు అందర్నీ కూడా పనిలో పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల విధుల్లోకి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమంగా తీసుకెళ్తామని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ . వేల్పుల ఏసొబు, కళావతి, సత్యవతి, జాన్ బి, ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహిళకు 26వేలు ఆర్థిక సహాయం



**నందిగామ,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : కాలుకి శస్త్ర చికిత్స జరిగి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహిళకు ఆర్యవైశ్య సంఘ నాయకులు పారేపల్లి సాయిబాబా నాయకత్వంలో నందిగామ ఆర్యవైశ్య సంఘ నాయకులు సోమవారం 26 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. నందిగామ ఆర్యవైశ్య సంఘ నాయకులు పారేపల్లి చిన్నారి, వనమా బుల్లెబ్బాయి, నకిరికంటి నరేష్ కుమార్, కూరపాటి పూర్ణ,చవట నవీన్, ఉడుత శ్రీను తదితరులు రాజ్యలక్ష్మి కి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

# ఆవేదన వ్యక్తం చేసిన సిపిఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్



**విస్సన్నపేట,అక్టోబరు 1 (వార్తాప్రభ)** : ప్రజా సమస్యల పరిష్కారం కొరకు 30 సంవత్సరాలుగా మహిళా హక్కుల కొరకు పోరాడుతున్నానని కమ్యూనిస్టు భావజాలంతో సేవలందిస్తున్న నేను ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా సిపిఐ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా విధుల నుండి తప్పుకుంటూ రాజీనామా చేస్తున్నట్టు మేకల కుమారి మీడియా సమావేశంలో . ప్రస్తుతం ఉన్న ముగ్గురు నాయకులు మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వారి నుండి ఇబ్బందులు పడినట్లు చెప్పారు. డమ్మీ పుస్తకాలు వాడి వేలాది రూపాయలు తీసుకున్నారని ఆమె ఆరోపించారు. దాని ఎంత పోరాడిన ఏమీ చేయలేకపోయానని జిల్లాస్థాయి పదవిలో ఉన్న నేను ఆడపిల్లలకు అన్యాయం జరిగిందంటే నేరుగా వెళ్లి పోరాడే పరిస్థితి కూడా లేదన్నారు.

# సింగరేణిలో వృత్తి శిక్షణ తరగతులు!!

■ ప్రారంభించిన ఆర్జీవన్ సేవా ప్రెసిడెంట్ అనిత



**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 1 (వార్తాప్రభ ప్రతినిధి)**సింగరేణిలో వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించారు ఆర్జీవన్ సేవా ప్రెసిడెంట్ అనిత. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.... కంపెనీ సామాజిక బాధ్యతలో భాగంగా ఉపాధి కల్పన అందించుటకై వృత్తి శిక్షణ కేంద్రాలను నెలకొల్పి తద్వారా శిక్షణ అందిస్తూ వేలాది మందికి దోహదపడుతున్న సింగరేణి సంస్థ సేవలు వెలకట్టలేనివని అన్నారు. నేటి ఆధునిక సమాజంలో ఫ్యాషన్ ప్రాముఖ్యత పెరిగినదని తెలిపారు. ఫ్యాషనుకు అనుగుణంగా బ్యూటీషియన్, మగ్గం వర్క్, కుట్లు అల్లికలు, డిజైనింగ్, ఎంబ్రాయిడరింగ్ శిక్షణ పొంది ఆర్థికంగా మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరి అరెల్లి పోషం, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హన్మంతరావు, లేడిస్ క్లబ్ సభ్యులు, ట్రెయినర్స్, అధిక సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే గాంధీ పరామర్శ



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 1 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండలో గల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివాసానికి చేరుకొని వారి తండ్రి పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించి,వారి కుటుంబ సభ్యులను పి ఎ సి చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరామర్శించారు..ఈ కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులతో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి భేటీ



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 1 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కొరకు మంగళవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు.అనంతరం జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి గారితో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్,రాయదుర్గం,నల్లగండ్ల హుడా కాలనీ,నానక్ రామ్ గుడా లలో సీసీ రోడ్లు దెబ్బ తినడం వల్ల చిన్న పాటి వర్షానికి గుంతలలో నీరు నిలిచి స్థానిక ప్రజలు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తక్షణమే నూతన రోడ్లు వేయించాలని అలాగే గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని జనాభా దృశ్య రోడ్డు వెడల్పు కూడా చేయవలసిన అవసరం ఉందని కార్పొరేటర్ జోనల్ కమిషనర్ ని కోరడం జరిగింది.గచ్చిబౌలి డివిజన్ విస్తారమైన ప్రాంతం కాబట్టి,ఇక్కడ అన్ని రాష్ట్రాల ప్రజలు నివసిస్తారని,స్థానికుల మౌలిక వసతుల కోసం తగిన నిధులు మంజూరు చేయవలసిందిగా కార్పొరేటర్ జోనల్ కమిషనర్ కి కోరడం జరిగింది.దీనికి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించడం జరిగింది.అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై,చేపట్టవలసిన అభివృద్ధి పనులపై,కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా చర్చించారు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి. పెండింగులో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి త్వరిత గతిన పూర్తయ్యేలా చూడాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ ని కార్పొరేటర్ కోరారు.ఈ కార్యక్రమంలో ఈఈ దుర్గాప్రసాద్,డిఈ విసాలాక్షి,డీఈ ఆనంద్,ఏఈ రషీద్,వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాంచందర్ యాదవ్,ఉపాధ్యక్షులు రాయుడు,సీనియర్ నాయకులు సుమన్ తదితరులు పాల్గొన్నారు



# బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కే.యం. ప్రతాప్

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 1 (వార్తాప్రభ)**: కుత్బుల్లాపూర్ 127 రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నందానగర్ లో మంగళవారం కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో స్కూల్ మేనేజ్మెంట్ వారు నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె. యం. ప్రతాప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ...విద్యార్థులకు విద్యతో పాటు, మన సాంస్కృతి సంప్రదాయాలను అందిస్తున్నందుకు స్కూల్ మేనేజ్మెంట్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు, స్కూల్ మేనేజ్మెంట్ వారు తదితరులు పాల్గొన్నారు.




# కానరాని 100% రుణమాఫీ!!

■ రైతు రుణమాఫీపై షరతులు సిగ్గుచేటు ■ ఎన్నికల హామీలు కాంగ్రెస్ నెరవేర్చాలి

■ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్



**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 1 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రుణమాఫీ 100% కనిపించడం లేదని, రైతులకు ఇచ్చిన రుణమాఫీలపై షరతులు సిగ్గుచేటు అని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టరుకు రైతులకు 100% రుణమాఫీ చేయాలి అని డిమాండ్ చేస్తూ మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్, మాజీ పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిలతో కలిసి డిమాండ్ లెటర్ అందించారు చందర్. అనంతరం మీడియాతో చందర్ మాట్లాడుతూ..... ఎన్నికల హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి అని తెలిపారు. ఎన్నికల సమయంలో ఒక తీరుగా, గెలిచాక మరో తీరుగా ప్రవర్తించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిది కాదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంక్షలు షరతులు విధించకుండా రుణం తీసుకున్నటువంటి రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ పక్షాన పోరాటం తీవ్రతరం, ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సేఫ్టీ, ప్రొడక్షన్ సింగరేణికి రెండు కళ్ళు!!

■ సెప్టెంబర్ మాసంలో 82% బొగ్గు ఉత్పత్తి ■ స్థానికులకే ఉద్యోగ కల్పన అంశంలో పురోగతి ■ సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్




**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 1 (వార్తాప్రభ ప్రతినిధి)**సేఫ్టీ, ప్రొడక్షన్ సింగరేణికి రెండు కళ్ళు అని అభివర్ణించారు సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్. ఈ మేరకు మంగళవారం మాసపు మీడియా సమావేశంలో సెప్టెంబర్ నెల బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత తదితర అంశాలను వెల్లడించారు జీఎం. స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే నేపథ్యంలో జరుగుతున్న ఇబ్బందుల దృష్ట్యా సెప్టెంబర్ నెల 82% బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు తెలిపారు. పీసీ పటేల్ కంపెనీ, యూనియన్లు మధ్య ఒప్పందం ఒక కొలిక్కి వచ్చినది అని తెలిపారు. ప్రతి కార్మికుడు సింగరేణి కుటుంబ సభ్యులలాగా రక్షణ చర్యలను పాటిస్తూ సంస్థ లాభాల బాటలో ప్రయాణించడానికి శాయశక్తుల కృషి చేయాలి అని సూచించారు. వీలైనంత త్వరగా సింగరేణి పరిధిలోని రోడ్డు వెడల్పు కార్యక్రమాలు పూర్తిచేసి రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. మీడియా సమావేశంలో పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, ఏ.జి.ఎం. దాసరి వెంకటేశ్వర్ రావు, ఏ.జి.ఎం. ఆంజనేయులు జీయంతో పాటు పాల్గొన్నారు.

# అందంగా ముస్తాబైన బ(డి)తుకమ్మ!!

■ తెలుగు కట్టుబొట్టులో మెరిసిన విద్యార్థినులు

■ చప్పట్లు, కోలాటం శబ్దాలతో మారుమ్రోగిన ఇండో అమెరికన్ పాఠశాల



**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 1 (వార్తాప్రభ ప్రతినిధి)**ఎంగిలిపూల చిన్న బతుకమ్మకు ఒకరోజు ముందుగానే బ(డి)తుకమ్మ అందంగా ముస్తాబైనది. మంగళవారం స్థానిక గోదావరిఖని ఎల్బీనగర్లో గల ఇండో అమెరికన్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తెలుగు కట్టుబొట్టులో మెరిసినారు. చప్పట్లు, కోలాటం శబ్దాలతో ఇండో అమెరికన్ పాఠశాల ప్రాంగణం మారుమ్రోగినది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పేరం హేమ లత విద్యార్థినుల మాతృమూర్తులకు స్వాగతం పలికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అందంగా తంగేడు, సీత జడ, ముద్దబంతి, గునుగు, చామంతి పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను ప్రతిష్టించి చుట్టూ తిరుగుతూ, పాటలు పాడుతూ, కోలాటం ఆడుతూ, చప్పట్లు కొడుతూ సంతోష సముద్రంలో మునిగితేలారు మహిళలు, విద్యార్థినులు.



బతుకమ్మ విశిష్టతను తెలియజేయాలనే ఉద్దేశంతో, సాంప్రదాయ విలువలను కాపాడాలనే సంకల్పంతో ప్రతి ఏటా పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు పాఠశాల డైరెక్టర్. బతుకమ్మ వేడుకలలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, టీచర్లు, అధిక సంఖ్యలో విద్యార్థినుల మాతృమూర్తులు పాల్గొన్నారు.

# అర్థవార్షిక యూరియా ప్రొడక్షన్ సంతృప్తికరం!!

■ ఉత్పత్తి సాధనలో ప్రతి ఒక్కరి పాత్ర అభినందనీయం

■ రామగుండం ఎరువుల కర్మాగారం సీ.జీ.ఎం. ఉదయ్ రాజహంస



**పెద్దపల్లి/ రామగుండం: అక్టోబర్ 1 (వార్తాప్రభ ప్రతినిధి)**అర్థవార్షిక యూరియా ప్రొడక్షన్ సంతృప్తికరంగా ఉందని రామగుండం ఎరువుల కర్మాగారం సీ.జీ.ఎం. ఉదయ్ రాజహంస తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆర్.ఎఫ్.సి.ఎల్. సి.జి.ఎం. కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేసి హాఫ్ ఇయర్లీ ప్రొడక్షన్ రిపోర్ట్ వివరాలను వెల్లడించారు. దేశంలో ఎరువుల కొరత తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన రామగుండం ఎరువుల కర్మగారం పూర్తిస్థాయి ఉత్పాదకతలతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గడచిన 6 నెలలలో 617600.43 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేసినట్లు, ఉత్పత్తి చేసిన యూరియాలో తెలంగాణ 216036.45, ఆంధ్ర ప్రదేశ్ 56481.30, కర్ణాటక 133897.77, మహారాష్ట్ర 66436.92, ఛత్తీస్‌గఢ్ 43869.06, తమిళనాడు 46529.91, మధ్యప్రదేశ్ 54349.02 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు వివరాలు వెల్లడించారు. ఉత్పత్తి సాధనలో ప్రతి ఒక్కరి పాత్ర, కృషి అభినందనీయం అని హర్షం వ్యక్తం చేశారు.

# నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం, దేవాలయ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన కే.యం ప్రతాప్



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 1 (వార్తాప్రభ)**: కుత్బుల్లాపూర్ 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీలో జరిగినటువంటి సంక్షేమ సంఘం ఎన్నికలలో ఎస్.విజయసాగర్ రెడ్డి వరుసగా మూడవసారి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. సంక్షేమ సంఘం వారు శ్రీ సాయిబాబా దేవాలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, దేవాలయ కమిటీ అధ్యక్షునిగా బి.యాదగిరి యాదవ్, ప్రధాన కార్యదర్శి గా నందమ్ గౌడ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ గ్రామంలోని, సిపిఆర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, బోకేతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం వారిని, శ్రీ సాయిబాబా దేవాలయ కమిటీ వారిని అభినందించారు. సంక్షేమ సంఘం వారికి, దేవాలయ కమిటీ వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, కార్యవర్గ సభ్యులు వి. హరిబాబు, జి.ఎస్. రాజు,ఎస్ కే వి. రాజు, సుందరయ్య,శంకర్ చారి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ
హైదరాబాద్

# డిగ్రీ కాలేజీలో బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో!!

■ సరికొత్త సొబగులు అద్దుకున్న పూల బతుకమ్మలు
■ అందంగా పేర్చి ఆడి పాడిన లెక్చరర్లు, విద్యార్థినులు
■ తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే ప్రకృతి పండుగ బతుకమ్మ ■ గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా





**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 1 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే ప్రకృతి పండుగ బతుకమ్మ అని కొనియాడారు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా. ఈ సందర్భంగా కళాశాలలో ముందస్తుగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కాలేజీలో బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అనే పాటతో మొదలైన వేడుకలు ఒక్కేసి పువ్వేసి చందమామ అనే జానపద గీతంతో ముగింపు కాబడ్డాయి. బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు కళాశాల మహిళా లెక్చరర్లు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పలువురు లెక్చరర్లు మాట్లాడుతూ.....తెలంగాణ సంసృతి, సంప్రదాయాలకు బతుకమ్మ అద్దం పడుతోందని అన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆడుతూ సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రకృతితో మమేకమైన మన తెలంగాణ పండుగ బతుకమ్మ పండుగను మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని చిన్నా పెద్ద తేడా లేకుండా ప్రపంచ నలుమూలలలో మన తెలంగాణ ఖ్యాతిని చాటాలని తెలియజేశారు. వేడుకలలో కళాశాల లెక్చరర్లు, స్టూడెంట్స్, కాలేజీ స్టాఫ్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులలో రాజీ పడవద్దు, నాణ్యత ప్రమాణాలు పాటించాలి

## -కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 1 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి డివిజన్ లోగల రాజీవ్ గృహకల్ప లో సీసీ రోడ్డు, డ్రైనేజీ మరియు వివిధ సమస్యలపై పర్యటించి పరిశీలించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.రాజీవ్ గృహకల్ప బస్తీలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకు ంటున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. పాదయాత్రల ద్వారా ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు జవాబుదరీగా పనిచేస్తున్నట్లు తెలిపారు.నేరుగా బస్తీ వాసులను కలుసుకుని స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పలువురు స్థానికులు తమ బస్తీలో డ్రైనేజీ,త్రాగునీటి పైప్ లైన్ నిర్మాణాలు చేపట్టిన తరువాత రోడ్డు నిర్మాణం చెప్పట్టాలని కోరారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ..రాజీవ్ గృహకల్ప లో దాదాపుగా సీసీ రోడ్లు పూర్తవ్వగా మిగిలిన కొన్ని చోట్ల నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు డ్రైనేజీ,త్రాగునీటి పైప్ లైన్ ఏర్పాటు సాధ్యసాధ్యలను పరిశీలించి పైప్ లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. బస్తిల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం బస్తీలలో,కాలనీలలో విస్తృతంగా పాదయాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం లింగంపల్లి రైల్వే స్టేషన్ అండర్ బ్రిడ్జి వద్ద నూతనంగా నిర్మిస్తున్న బాక్స్ నాలా కల్వర్ట్ పనులను సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు.పనుల విషయంలో రాజీ పడవద్దని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సెక్షన్ డీఈ ఆనంద్,జిహెచ్ఎంసీ శానిటేషన్ ఏ ఎమ్ హెచ్ ఓ డాక్టర్ శ్రీకాంత్,జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సెక్షన్ ఏఈ భాస్కర్,వార్డ్ మెంబర్ శ్రీకళ, బసవయ్య,బస్వరాజ్, కుటుంబరావు,వెంకటేశ్వర్లు, యోగి, మహేందర్,సారయ్య, ఠాగూర్ విశాల్,తిరుపతయ్య, కొండల్,మహిళా నాయకురాళ్లు చంద్ర కళ, కుమారి,కళ్యాణి,లక్ష్మి, గౌసియా,ఫాతిమా,ప్రవళిక, శశికళ,జమ్మయ్య మరియు జిహెచ్ఎంసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు





# శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ లో బతుకమ్మ వేడుకలు



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 1 (వార్తాప్రభ)** : గాజులరామారం చిత్తారమ్మ దేవి నగర్ లో శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ నందు మంగళవారం బతకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... బతుకమ్మ, దసరాకు ఉన్న ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు , ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## వారాహి సభలో పవన్ ఏమి చెప్పబోతున్నారు ?

జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుమలలో రెండు రోజులు ఉండబోతున్నారు. ఆయన చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షను ఈ నెల 2న తిరుమలలో విరమించనున్నారు. ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు. దానికి సంబంధించి పవన్ కళ్యాణ్ అక్టోబర్ 1న నుంచి 3 వరకూ అంటే రెండు రోజుల పాటు తిరుమలలో ఉండబోతున్నారు ఇక పవన్ తాజా పర్యటన మేరకు చూస్తే ఆయన 3వ తేదీన తిరుపతిలో వారాహి నుంచి ప్రజలను ఉద్దేశించి సభను నిర్వహిస్తారు అని అంటున్నారు. ఇపుడు ఆ సభ మీద అందరి దృష్టి ఉంది. పవన్ ఏమి చెప్పబోతున్నారు అన్నదే అందరిలో కలిగే ఉత్కంఠ. నిజానికి లడ్డూ ఇష్యూలో సుప్రీంకోర్టు కూడా అక్టోబర్ 3న తీర్పు వెలువరించబోతోంది. ఆ తీర్పు తరువాత పవన్ సభ ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక హిందూ ధర్మం గురించి అలాగే శ్రీవారి లడ్డూ ప్రసాదం గురించి ఇటీవల వాడిగా వేడిగా వ్యాఖ్యలు చేసిన పవన్ గత కొద్ది రోజులుగా మౌనంగా ఉన్నారు. అదే సమయంలో సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ సాగుతోంది. అయితే పవన్ షెడ్యూల్ చూస్తే వారాహి సభ తిరుపతిలో జరిగే అవకాశాలే కనిపిస్తున్నాయి. నిజానికి సుప్రీం కోర్టు విచారణ కనుక ఈపాటికి జరగకపోయి ఉంటే పవన్ ప్రసంగం ఒక విధంగా ఉండే అవకాశం ఉంది. అయితే సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా కోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు కూడా అందులో ఉన్నాయి. రాజకీయాల నుంచి దేవుడిని పక్కన పెట్టాలని కూడా కోర్టు సూచించింది. మరో వైపు చూస్తే జగన్ తిరుమల వస్తారని తెలియడంతో గత నెల 27న తిరుమలలో సెక్షన్ 30ని అమలు చేస్తున్నారు. ఇది సరిగ్గా అక్టోబర్ 24 వరకూ ఉండే చాన్స్ ఉంది. అంటే అప్పటి వరకూ సభలూ సమావేశాలు ఎవరూ నిర్వహించకూడదు అని అంటున్నారు. మరి పవన్ సభకు అనుమతిస్తారా అన్న చర్చ ఉంది. ఇంకో వైపు చూస్తే తిరుపతి ఎంపీ వైసీపీ నేత గురుమూర్తి పవన్ వారాహి సభ మీద మాట్లాడుతూ సుప్రీంకోర్టులో లడ్డూ వివాదం మీద విచారణ జరుగుతున్నందువల్ల పవన్ సభను విరమించుకోవాలని సూచించారు ఇవన్నీ పక్కన పెడితే గత అయిదేళ్లలో అంటే వైసీపీ పాలనలో హిందూ దేవాలయాల మీద జరిగిన దాడులు అనేక చోట్ల ఉపచారాలలో జరిగిన అపచారాల మీద పవన్ వారాహి సభలో ప్రస్తావిస్తారు అని అంటున్నారు. దీని మీద పవన్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చినట్లుగా ఆయన మీడియాతో మాట్లాడిన మాటలను బట్టి అర్థం అవుతోంది. తాను చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష లడ్డూ ప్రసాదం గురించి మాత్రమే కాదని గతంలో ఏపీలో అపచారానికి గురి అయిన వందలాది దేవాలయాల గురించే అని ఆయన చెప్పారు. అంటే ఈ ఇష్యూని పవన్ కళ్యాణ్ తనదైన శైలిలో ముందుకు తీసుకుని వెళ్ళేలాగానే ఉన్నారని అంటున్నారు. ఆయన హిందూ దేవాలయాల మీద వైసీపీ ప్రభుత్వంలో ఉన్నపుడు కలిగిన ఇబ్బందులు అన్నీ ప్రస్తావిస్తారు అని అంటున్నారు. ఏది ఏమైనా ఏపీలో లడ్డూ ఇష్యూ నుంచి హిందూ దేవాలయాలు వాటి మీద జరిగిన అపచారాలు దాడులు వంటి వాటి మీదకు మళ్ళితే మరో కొత్త రాజకీయానికి బీజం పడుతుందని అంటున్నారు. చూడాలి మరి పవన్ ఏమి మాట్లాడుతారో.

## రెడ్డిగూడెంలో పింఛన్ పంపిణీ లో పాల్గొన్న మండల తెదేపా నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి



**రెడ్డిగూడెంఅక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):**:రెడ్డిగూడెం లో పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. పింఛన్ల పంపిణీ లో నాగేశ్వరరెడ్డి తో పాటు మండల పార్టీ నాయకులు,గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సమాధార్భంగా నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ,గత ప్రభుత్వం 3000 పెన్షన్ ఇవ్వగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 4000 వేలు పింఛను ఇవ్వడంతో రాష్ట్రంలో 65 లక్షల కుటుంబాలు సంతోషంలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు ఉయ్యూరు సుబ్బారెడ్డి, చాట్ల చందా తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ - మన బాపూజీ



కరంచంద్,పుత్లీబాయి
దంపతులకు పుట్టారు
నిండు పున్నమి వెన్నెలై
గాంధీ గారు వెలిగారు
"మోహన్ దాస్ కరంచంద్
గాంధీ" పేరు పెట్టారు
కడు అల్లారు ముద్దుగా
తల్లిదండ్రులు పెంచారు
గుజరాత్ రాష్ట్రంలోన
పోర్ బందర్ ఊరిలోన
ఉదయించెను భాస్కరుడై
భారతి ముద్దు బిడ్డయై
సుతిమెత్తని స్వభావం
లేదు లేదు అహంభావం
తల్లి అంటే గౌరవం
తండ్రి అనిన సద్భావం
చందమామలాంటి వారు
చిన్ననాట గాంధీ గారు
సిరిమల్లెపూవు నగవు
కలహాలే అసలు తగవు
ఇది గాంధీజీ బాల్యం
అది మణి వోలె అమూల్యం
అందరికీ ఆదర్శం
భారతీయుల మహా భాగ్యం

**గద్వాల సోమన్న**
996641458

## అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి. -సిడిపిఓ!!!

**మచిలీపట్నం అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):**మచిలీపట్నం ఐసిడిఎస్ మచిలీపట్నం ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓ గ్లోరీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ వెలువరించారు. మినీ అంగన్వాడీ కార్యకర్తలతో పాటు సహాయకుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్ లో వివరించారు. మొత్తం తొమ్మిది పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. బందరు మండలంలో చిన కానూరు( బీసీ బి )చంపచెరువు( ఓ సి జనరల్ )లో మినీ అంగన్వాడీ పోస్టులు క్యాంప్ బెల్ పేట(2) (ఎస్ టీ )లో సహాయకురాలి పోస్టు పల్లెపాలెం (బిసి ఎ )ఎస్ ఎస్ పురం (ఎన్ సి )పెదయాదర( ఓ సి )చిరువెళ్లపాలెం (బీసీ డి) రుస్తుంబాధ( ఓ సి జనరల్ )అంగన్వాడీ కేంద్రాలలో సహాయ కురాలు పోస్టులు భర్తీ చేస్తామన్నారు. అలాగే గూడూరు(5)లో హెల్పర్ పోస్టు(ఓ సి )ఖాళీగా ఉంది .వివాహితులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 10వ తేదీన సాయంత్రం ఐదు గంటలలోపు బందరులోని ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి. పదవ తరగతి పాస్ అయిన వారు దరఖాస్తు చేసుకోవాలి. ఈ సంవత్సరం జూలై నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు ఉండాలి. అలాగే ఎస్సీ ఎస్టీ బీసీ అభ్యర్థులు లేటెస్ట్ కుల ధ్రువీకరణ పత్రాలు జతచేయాలి.

# మచిలీపట్నం- రేపల్లె రైల్వే లైన్ నిర్మాణం-ఎంపీ బాలశౌరి!!!

■ దివిసీమ ప్రజల చిరకాల కోరిక!!!



**మచిలీపట్నం అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):**మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి మంగళవారం ఆర్ అండ్ బి అధితి గృహం లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ దివిసీమ ప్రజల దశాబ్దాల, చిరకాల కోరిక ,కల ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మచిలీపట్నం - రేపల్లె రైల్వే లైన్ నిర్మాణం కోసం కేంద్రం సానుకూలం గా స్పందించిందని అన్నారు. ఈ రైల్వే లైన్ చల్లపల్లి, అవనిగడ్డ, భట్టిప్రోలు, నిడుబ్రోలు బాపట్ల వరకు పొడిగించాలని రైల్వే మంత్రిని కోరడం జరిగిందన్నారు. మచిలీపట్నం- రేపల్లె రైల్వే లైన్ తో విజయవాడ జంక్షన్ మీద ట్రాఫిక్ భారం తగ్గుతుంది అని అన్నారు. కేంద్ర రైల్వే మంత్రి ఇప్పటికే రైల్వే లైన్ పనులను సర్వే చేయాలని డిపిఆర్ రూపొందించాలని, త్వరలో మచిలీపట్నం బాపట్ల రైల్వే లైన్ సంబంధించిన పనులు ప్రారంభం కాబోతున్నాయి అని అన్నారు. హౌరా టు చెన్నై రైల్వే లైన్ చాలా ఫేమస్ ట్రంక్ లైన్ అని, ఈ లైన్ కు అనుసంధానం చేస్తూ మచిలీపట్నం నుంచి బాపట్ల నూతన రైల్వే లైన్ ఏర్పాటు చేయుటం జరుగుతుందన్నారు. మచిలీపట్నం నుండి తిరుపతి చెన్నై నగరాలకు వెళ్లే ప్రయాణికులకు 80 కిలోమీటర్ల దూరం తగ్గించటం చాలా సమయం ఆదవుతుందని, ఈ రైలు మార్గం ఏర్పాటుతో బందరు నియోజకవర్గ ప్రజల ప్రయాణ కష్టాలు సగానికి పైగా తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మచిలీపట్నం ఇంచార్జ్ బండి రామకృష్ణ, జనసేన నాయకులు గల్లా తిమోతి, గడ్డం రాజు, మాదివాడ రాము, 10వ డివిజన్ ఇంచార్జ్ భాషి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారుల జీవనానికి ఆసరా



■ అవ్వాతాతల మోముల్లో ఆనందం

**కనిగిరి అక్టోబర్ 1 వార్తా ప్రభ ప్రతినిధి** ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఒకటవ తేదీ పెన్షన్ ని పంపిణీ చేయడం చాలా ఆనందదాయకమని అడుసుమల్లి నరసింహులు అన్నారు. మంగళవారం కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం బొట్లగూడూరు గ్రామపంచాయతీలోని రఘునాధపురం, కమ్మవారిపాలెం మరియు అప్పమాంబపురం గ్రామంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ అచ్చమాంబ దేవస్థాన చైర్మన్ అడుసుమల్లి నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయాన్నే 6:00 నుండి పెన్షన్ పంపిణీ చేసే అధికారులు, టిడిపి నాయకులు తమ ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ చేస్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో చుంచు మాల్యాద్రి, అల్లూరి మాల్యాద్రి, అడుసుమల్లి సురేష్ బాబు , మెలింగి జనార్దన్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులూ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల పట్ల సేవాభావంతో ఆనందం పంచండి!!!

■ ప్రపంచవృద్ధుల దినోత్సవ వేడుకలో సీనియర్ సివిల్ జడ్జి కె.వి రామకృష్ణయ్య!!!



**మచిలీపట్నం అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):** మచిలీపట్నం చదువుతో కూడిన సంస్కారం పెద్దల పట్ల వినయ విధేయతలు అందిస్తుందని, అది నేటి తరం యువత తెలుసుకోవాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. ప్రపంచవృద్ధుల దినోత్సవ వేడుకలు స్థానిక ఈడేపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమం నందు మంగళ వారం వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీనియర్ సివిల్ జడ్జి కె.వి రామకృష్ణయ్య మాట్లాడుతూ పిల్లలకు బాల్య దశ నుండి పెద్దలను ఎలా గౌరవించాలి, మన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టు బాట్లు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తెలియజేయాలని వారు పెద్దవారైన తర్వాత వారి తల్లిదండ్రులను ప్రేమతో చూసుకోవడం వల్ల భవిష్యత్తులో వృద్ధాశ్రమాలతో అవసరం లేకుండా పోతుందన్నారు. బాధ శరీరానికి కానీ మనసుకు కాదని వృద్ధాప్యంలో పిల్లలు తమకు దూరమయ్యారని బాధను దిగమింగి మానసిక క్షోభను దూరం చేసుకుంటే నూతన జీవనం గడపవచ్చు అన్నారు పిల్లలు తమ చదువు వల్ల సంపాదనపరులు అయినా సంస్కారం లేని చదువు, పెద్దలను గౌరవించలేని చదువు వ్యర్థం అన్నారు. మన శరీరానికి సుఖాన్ని కష్టాన్ని అలవాటు చేయాలని చిన్నప్పటినుండి పిల్లలు తమ బాధ్యత గుర్తు ఎరిగేలా తల్లిదండ్రులు పోషించాలన్నారు. తమ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా వృద్ధాశ్రమాలకు సేవలు చేస్తున్న, వెలుగు ఫౌండేషన్, లాంటి స్వచ్ఛంద సంస్థలు స్వచ్ఛందంగా సేవను అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిధిగా విచ్చేసిన రెవరెండ్ డాక్టర్ బి ఎస్ కిరణ్ పాల్ మాట్లాడుతూ తెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించడం అభినందనీయం అన్నారు. తాము ద్వేషింపబడినా, తిరస్కరింపబడినా తమ పిల్లలు బాగుండాలని కోరుకునే మంచి మనస్తత్వం ఉన్న మాతృమూర్తులు పితృదేవులు అభినందనీయులన్నారు. వృద్ధులు వ్యర్థం కాదని దేవుడు వీరికి చక్కని అవకాశాన్ని ఇచ్చాడని అన్నారు. పిల్లలకు భారమైన ఇలా వృద్ధాశ్రమాల్లో గడపవలసి వస్తోందని అంతమాత్రాన వీరు నిరాశా, నిస్పృహలకు గురికాకుండా ఉత్తేజ భరితంగా నూతన జీవితాన్ని గడపాలనిఅన్నారు. వయసు లెక్క అంకెలకు మాత్రమే పరిమితం అని హృదయం మనసు ఎప్పుడూ నిశ్చయమనంగానే ఉంచుకోవాలని తెలిపారు. చింత చిత్తాన్ని దహించి వేస్తుందని సంతోషం గా ఉంటూ మానసిక ఆనందం పొందాలని కిరణ్ పాల్ అన్నారు. ఈడేపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పళ్ళు పంపిణీ చేశారు. బెరాకా మినిస్ట్రీస్ అధినేత డాక్టర్ కిరణ్ పాల్ స్టాండ్ ఫ్యాన్ సీనియర్ సివిల్ జడ్జి కెవి రామకృష్ణయ్య చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ టీ పెద్దిరాజులు, న్యాయవాదులు అజ్మతున్నిసా, సి. ముసలయ్య, ప్రశాంతి, మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కే వేణు కుమార్, రమాదేవి, సాహితీవేత్త ముదిగొండ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులందరికీ ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం అందించండి

■ 43 వ,డివిజనులో ఏకలవ్య నగర్ వాసులు గోడు పట్టించుకోండి

■ ఆంధ్రప్రదేశ్ ఎస్టి కార్పొరేషన్ మాజీ ట్రైకర్ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ డిమాండ్



**విజయవాడ అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):**వరద బాధితులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం అందరికీ అందేలా చూడాలని 43 వ,డివిజనులో ఏకలవ్య నగర్ వాసుల గోడు పట్టించుకొండని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కార్పొరేషన్ మాజీ ట్రైకర్ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ మంగళవారం డిమాండ్ చేశారు. వరద బాధితులు అందరూ ఆయన ముందు తమ గోడును విన్నవించారు. ఈ మధ్యకాలంలో వరదలు వచ్చి ప్రతి ఇల్లు నీటి మునిగి ప్రజలందరూ కూడా తీవ్ర ఇబ్బందులతో పాటు ఆర్థికంగా వారి యొక్క సామగ్రి మొత్తం పోగొట్టుకొని ఎన్నో ఇబ్బందులు పడ్డారో ప్రతి ఒక్కరికి తెలిసినదే అయితే ప్రజలకు జరిగిన ఈ విపత్తి నీ గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చి ప్రతి ఇంటికి గ్రౌండ్ ఫ్లోర్ 25000 ఫస్ట్ ఫ్లోర్ 10000 టూ వీలర్ కి 3000 ఆటో కి 10000 ఇస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి హృదయపూర్వక ధన్యవాదాలు. ఆయన ఇచ్చిన హామీ నెరవేర్చి ప్రతి ఒక్క అకౌంట్ కి అమౌంట్ పంపిస్తున్నామని చెప్పారు. బాధితులు అందరూ ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో వారు పంపించినటి అమౌంట్ మా కాలనీవాసులకు 90 శాతం మంది ప్రజలకు వారి అకౌంట్లకు డబ్బులు రాలేదు అందుకు ఆ కాలనీ ప్రజలందరూ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. రామకృష్ణ వారికి భరోసా ఇచ్చి తాను వారొక పేరు, ఫోన్ నెంబర్ తీసుకొని కలెక్టర్ కి దృష్టికి తీసుకువెళ్లి ప్రజలకు న్యాయం జరిగేలా పోరాడతానని ఆయన ప్రకటించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా మా విన్నపం అయ్యా మా ప్రజానీకానికి ఎవరికైతే అకౌంటు లోకి డబ్బులు రాలేదు వారందరూ కూడా రీ సర్వే చేయించి ప్రతి ఒక్కరికి అకౌంట్లో డబ్బులు వచ్చేలా చూడాలని మీకు విన్నపించుకుంటున్నామని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ సేవా సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కావాటి కృష్ణ, 43 డివిజన్స్ స్థానిక నాయకులు, దశరథ, 43 డివిజన్ స్థానిక నాయకులు, దాసరి తిరుప తయ్య, ప్రసాద్, పాల్గొన్నారు

## పాత విధానంలో ఇసుక అందజేయాలి - బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ




**జగ్గయ్యపేట అక్టోబర్ 1 (వార్తా ప్రభ)** ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఇసుక ఆన్లైన్ విధానం లో భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడే విధంగా ఉందని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వాహనాలకు జిపిఎస్ సిస్టం, ఆన్లైన్ బుకింగ్ స్థానికులకు అవడం లేదని. ఇతర ప్రాంతాల వారు ఈ ప్రాంతంలోని ఇసుకను తరలించుకుపోతున్నారని. ఇసుకను పాత విధానంలో ట్రాక్టర్లకు లోడ్ చేయాలని ఇసుక యార్డ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. నాయకులు అధికారులు ఇసుకను ఆన్లైన్ విధానం తొలగించి. పాత పద్ధతిలో ఇసుకను అందజేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని శాసనసభ్యుల కార్యాలయంలోనూ, మండల రెవెన్యూ కార్యాలయంలోనూ వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నేలకంఠ శివప్రసాద్. అధ్యక్ష కార్యదర్శులు అంబోజి శివాజీ, పోతుపాక వెంకటేశ్వర్లు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## చెకుముకిలో లుంబిని విద్యార్థి ప్రథమ స్థానం



**చేజర్ల అక్టోబర్ 01 (వార్తాప్రభ)** మండల స్థాయిలో ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలకు నిర్వహించిన చెకుముకి ట్యాలెంట్ టెస్ట్ లో మండల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొని జిల్లా స్థాయికి ఎంపికైన లుంబిని విద్యార్థులు యు. అనూష 10 వ తరగతియం.విష్ణుతేజ 9 వ తరగతిపి.జితేంద్ర 8 వ తరగతిపాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు.

## డిప్యూటీ తహశీల్దారుగా మస్తానయ్య బాధ్యతలు



**చేజర్ల అక్టోబర్ 01 (వార్తాప్రభ)** మండల నూతన డిప్యూటీ తహశీల్దారుగా ఆర్ మస్తానయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో చేజర్లలో ఆర్ఐగా విధులు నిర్వహించి ఎన్నికల సమయంలో ఆత్మకూరుకు బదిలీపై వెళ్లిన మస్తానయ్య పదోన్నతిపై డీటీగా నియమించబడ్డారు. సాధారణ బదిలీల్లో భాగంగా మండలానికి వచ్చిన మస్తానయ్య బాలాయ పల్లి నుండి బదిలీపై వచ్చారు. మంగళవారం తహశీల్దారు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి ఈ ప్రాంత ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

## స్వచ్ఛత సామాజిక బాధ్యత

### - వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం - హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం



**గుంటూరు,అక్టోబర్ 1, (వార్త ప్రభ ప్రతినిధి ):**పరిసరాల స్వచ్ఛత సామూహిక బాధ్యత అని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. భారత ప్రభుత్వము, కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర, గుంటూరు, వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ మరియు హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణం లో 'స్వచ్ఛతా హీ సేవ 2024' కార్యక్రమాన్నీ నిర్వహించారు. ఈ సందర్భముగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ తోనే స్వచ్ఛ గ్రామాల గా రూపుదిద్దుకుంటాయి అన్న మహాత్మా గాంధీ నినాదంతో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను చేపట్టి స్వభావ్ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని తెలిపారు. కాలేజ్ డైరెక్టర్ ఐజాక్ ప్రసాద్ అపరిశుభ్రత ప్రాంతాలను ఎంచుకొని అక్కడ ప్రజలకు అవగాహన కల్పించి స్వచ్ఛతపై దృష్టి సారించి వారికి తగిన పరికరాలను అందించి పరిశుభ్రత పై దృష్టి సారించే విధంగా సంఘటితం చేయడం అవసరమని అన్నారు. వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ నిర్వహిస్తున్న స్వచ్ఛత కార్యక్రమాన్ని ఒక సామాజిక ఉద్యమంగా తీసుకొని ప్రతి ఒక్కరు కూడా బాధ్యతగా నిర్వహించడం వల్ల వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చు ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మరియు ట్రస్ట్ సభ్యులు పాశం సర్దార్ అభినంద్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ సభ్యులు, హిందూ కాలేజ్ ఎన్ ఎస్ ఎస్ విభాగం, మానవ హారంగా ఏర్పడి ప్లకార్డులు మరియు నినాదాలతో వ్యర్థాలను వెరివేయడము, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకాన్ని తగ్గించటం పై అవగాహన కల్పిస్తూ స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్గొన్న వారికి అతిధులు నెహ్రూ యువ కేంద్ర గుంటూరు తరుపున మై భారత్ లోగో ఉన్న కాప్స్, డైరీస్ మరియు పెన్నులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు మరియు సౌత్ సెంట్రల్ రైల్వే సలహాదారులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అధ్యక్షత వహించగాకాలేజ్ ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి సందీప్ కుమార్, మోటివేషనల్ స్పీకర్ శరత్, వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ సభ్యులు కోనంకి మురళీకృష్ణ, సురేష్, కృష్ణ తేజ, ఉమేష్ చంద్ర మరియు హిందూ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## విజయవాడ అడిషనల్ డిసిపి గుణ్ణం రామకృష్ణ ని మర్యాదపూర్వకంగా కలిసిన తెదేపా నాయకులు

**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య, 40 డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చిన్న సుబ్బయ్య, లు మంగళవారం నగర ఏ డి సి పి గుణ్ణం రామకృష్ణ ని మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని అదేవిధంగా భవాని పురం ప్రాంతం వచ్చే భక్తులకు టూ వీలర్ మరియు దర్శన భాగ్యం త్వరగా అయ్యేటట్లు ఏర్పాట్లు చేయాలని కోరారు. అడిషనల్ డీసీపీకి నియమితమైన రామకృష్ణ ను కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీ నాయకులు గాలిబ్ షాహిద్, మోహన్ , నారాయణ తదితర నాయకులు వున్నారు.



## మానవత్వం చాటుకున్న పూజిత అపార్ట్మెంట్ వాసులు

### సింగ్ నగర్ వరద బాధితులకు దుస్తులు పంపిణీ



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పూజిత వాటర్ ఫ్రంట్ అపార్ట్మెంట్, తాడేపల్లి గల అపార్ట్మెంట్ వాసులు సింగ్నగర్ లోని లెనిన్ సెంటర్ నందు వరద బాధితులకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ప్రెసిడెంట్ ముళ్ళపూడి భగవాన్ మాట్లాడుతూ గత నెలలో వచ్చిన వరదలకు నగర ప్రజలు నివసించే కొన్ని ప్రాంతాలలో వరద నీరు చేరటం వలన వారి ఇంట్లో ఉన్న వంట సామిగ్రి, దుస్తులు మొదలగు ఎన్నో కోల్పోయారు, వారిని చూసి తమకు మనసు చెలించి, తమ వంతు ఏమైనా సహాయం చేయాలని, తాము అందరం నివాసం ఉంటున్నా పూజిత వాటర్ ఫ్రంట్ అపార్ట్మెంట్, వాసులు, సుమారు గా లక్షన్నర రూపాయల విరాళాలుగా సేకరించుకొని చీరలు,దుప్పట్లు, టవల్స్, లుంగీలు క్రొత్తవి కొనుగోలు చేసిన వాటితో పాటు , అపార్ట్మెంట్లో నివసించే వారి నుండి పాత బట్టలను సేకరించి సూక్ష్మంగా చినిగిన వాటిని కుట్టించి, ఉతికించి ఇస్త్రీ చేసి ప్యాక్ చేసి వరద బాధితులకు ఇవ్వటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ ప్రెసిడెంట్ ముళ్ళపూడి భగవాన్, సెక్రటరీ బలరాం,వైస్ ప్రెసిడెంట్ జ్యోతిర్మయి, భాను మూర్తి, కేశవర్ధన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్యక్ ఫెస్ట్ పోస్టర్ లాంచ్ చేసిన ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కె.ఎల్. యూనివర్శిటీ లో ఈనెల 4వ తేదీ నుంచి 5 వతేదీ వరకు నిర్వహించే సమ్యక్ నేషనల్ లెవల్ టెక్నో మెనేజ్ మెంట్ ఫెస్ట్ పోస్టర్ ను ఎంపి కేశినేని శివనాథ్ రిలీజ్ చేశారు. టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి ఆధ్వర్యంలో మంగళవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో ఈ ఫెస్ట్ నిర్వహిస్తున్న కె.ఎల్.యూనివర్శిటీ విద్యార్థులు ఎంపి కేశినేని శివనాథ్ ను కలిశారు. పోస్టర్ రిలీజ్ అనంతరం విద్యార్థులతో ఈ ఫెస్ట్ గురించిన వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు వినేష్, మనోజ్, మహేష్శ్వర్, సత్య, చైతన్య, జశ్వంత్ పాల్గొన్నారు.



సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా సెంట్రల్ నియోజకవర్గం 58వ డివిజన్ లో కృష్ణ హొటల్ సెంటర్ పాత శివాలయం దగ్గర జనసేన వీర మహిళ విజయ కుమారి ఆధ్వర్యంలో మహిళలందరూ కలిసి ఆ వెంకటేశ్వర స్వామిని శంఖు చక్రాలతో దీపాలంకరణ చేసి దీపారాధన చేయడం జరిగినది **–వార్త ప్రభ, విజయవాడ**

## మహాత్మా గాంధీ లీడర్ షిప్ అవార్డుకు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే

**కళ్యాణదుర్గం అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):**అక్టోబర్ 2న భారత జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా.. ఎన్నారై వెల్ఫేర్ సొసైటీ వారు యూకేలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ మ్యూజియంలో అక్టోబర్ 2 న గ్లోబల్ ఇండియన్స్ వారికి అందించే.. ప్రతిష్టాత్మకమైన మహాత్మా గాంధీ లీడర్ షిప్ అవార్డుకు అమిలినేని సురేంద్ర బాబు ఎంపికయ్యారు. యూకేలోని ప్రతి సంవత్సరం గాంధీ జయంతి నాడు మహాత్మా గాంధీ లిడర్ షిప్ అవార్డును ప్రదానం చేస్తారు.

# పెద్దలు మన జాతి సంపద

- తల్లిదండ్రులను దగ్గరుండి చూసుకోవాలి
- గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు





**గన్నవరం అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):**పిల్లలు తమ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో దగ్గర ఉండి చూసుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందినట్లు అని గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పిల్లల కోసం డబ్బులు సంపాదించి వారిని అమెరికా పంపి వారు ఇక్కడ ఇబ్బందులు పడటం చూస్తుంటే భాదేస్తుందన్నారు. మండలంలోని – చిన అవుటపల్లి పుణ్యాచారిటీస్ వృద్ధాశ్రమం, సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం మంగళవారం ఛారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ అందరు అమెరికా అంటున్నారని అది కారెక్ట్ కాదన్నారు. భవిష్యత్ లో వృద్ధాశ్రమాలు ఉండకూడదని ఎవరి తల్లిదండ్రులను వారే చూసకోవాలన్నారు. అందరు ఒకే వేదికలో ఉంటే కాలం సంతోషంగా గడుస్తోందని అన్నారు. వృద్ధులంటే చిన్న పిల్లలతో సమానమని వారిని చూసుకునే సమయంలో వారి పిల్లలు ఎక్కడో వేల మైళ్ల దూరంలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు ఎప్పటికప్పుడు ఆరోగ్యం పట్ల అ ప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం సీనియర్ సిటీజన్స్ నెక్కంటి నాగేశ్వరరావు, వీరమాచినేని భవాని ప్రసాద్, రావి నరసింహారావు. అట్లూరి ప్రేమ్ చంద్, కారుమూరి రాజేంద్ర ప్రసాద్ లను శాలువాలతో సత్కరించారు. పెద్ద అవుటపల్లి జోసఫ్ తంబి ఆవరణలోని వృద్ధా శ్రమానికి దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, పీవీ సత్యన్నారాయణ, వి.కామరాజు, మోత్కూరి వెంకటేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, గన్నే వెంకట్రావు. అవుటపల్లి మోహనరావు, కేఎస్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి మహోత్సవాలకు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)కు ఆహ్వానం

### ఆహ్వాన పత్రిక అందించిన దుర్గగుడి ఈవో, ప్రధాన అర్చకులు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇంద్రకీలాద్రి పై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో ఈ నెల 3 నుంచి 12 తేదీ వరకు నిర్వహించే దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు విచ్చేయాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ను ఆహ్వానించారు. మంగళవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో ఎంపి కేశినేని శివనాథ్ కు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ఈవో కె.ఎస్.రామారావు, ప్రధాన అర్చకులు ఎల్.దుర్గా ప్రసాద్, రంగవరుల శ్రీనివాస శాస్త్రి ఆహ్వానపత్రిక అందించటంతో పాటు అమ్మవారి తీర్ధ ప్రసాదాలు, శేష వస్త్రం అందజేశారు. వేద పండితుడు చిట్టి ఘనాపాఠి ఎంపి కేశినేని శివనాథ్ కి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ వారిని శాలువాతో సత్కరించారు. ఆ తర్వాత ఇంద్రకీలాద్రి పై జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవ ఏర్పాట్ల గురించి ఎంపి కేశినేని శివనాథ్ అడిగి తెలుసుకున్నారు.

## దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

■ భక్తుల కోసం ప్రత్యేక వసతులు ■ విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు సుజన చౌదరి



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అక్టోబర్ 3 నుండి 12 వ తేది వరకు ఇంద్రకీలాద్రిపై నిర్వహించనున్న దసరా ఉత్సవాలపై పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి) మంగళవారం మోడల్ గెస్ట్ హౌస్ లో సమీక్ష నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం శాఖామంత్రి వంగలపూడి అనిత, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు, బోండా ఉమామహేశ్వరరావు ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీరాం సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, ఆలయ ఈవో కేఎస్ రామారావు సంబంధిత అధికారులతో కలిసి దసరా ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుజన చౌదరి మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి పటిష్టమైన ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. సంబంధిత అధికారులతో ఇప్పటికే పలుమార్లు సమీక్షలను నిర్వహించి ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. అక్టోబర్ 9 వ తేదీన మూల నక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారని తెలిపారు. ఫసాడా లైటింగ్ ఈసారి ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు. 20 కిలోమీటర్ల మేర రోడ్లన్నీ విద్యుత్ దీపాలంకరణలతో కళకళలాడుతాయన్నారు. క్యూలైన్లు అన్నీ పూర్తిస్థాయిలో సిద్ధం చేశామని ప్రతీ వందడుగులకు అత్యవసర ద్వారాలు అదే విధంగా భక్తుల దాహర్తి తీర్చడానికి వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తామన్నారు. వెయ్యిమంది ఒకేసారి తమ వస్తువులను, చెప్పులను భద్రపరుచుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసామన్నారు. ఇక హోల్డింగ్ ఏరియాల వద్ద 200 మంది చొప్పున ఉండేలా ఏర్పాట్లు చేసామన్నారు .. శివాలయం వద్ద నుంచీ తాత్కాలికంగా బయటకు వెళ్ళే మెట్ల మార్గం ఏర్పాటు అదేవిధంగా ఇంద్రకీలాద్రి క్షేత్ర మహిమ తెలిపేలా లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని ఎమ్మెల్యే సుజనా తెలిపారు. అనంతరం మంత్రులతో కలిసి దుర్గా ఘాట్ లో కృష్ణమ్మకు జలహారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలి

### - విద్యార్థి యువజన సంఘాల డిమాండ్




**నూజివీడు,అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):**వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా విజయవాడ అలంకార్ సెంటర్ ధర్నా చౌక్ లో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, అనేక పోరాటాల ద్వారా 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటు అయిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం సరికాదని విద్యార్థి యువజన సంఘం నాయకులు అన్నారు లాభార్జనగల విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకొస్తామని చెప్పారు. రాష్ట్ర విభజన హామీలను మోదీ ప్రభుత్వం విస్మరించిందని, వీటి పైన ప్రధాని మోడీని బిజెపి రాష్ట్ర నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. విశాఖ ఉక్కు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిద్ర నటిస్తుందని, ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి కి రాష్ట్ర ప్రయోజనాల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు,ధర్నాలకు ప్రజలందరూ పూర్తి సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. ఇంతవరకు కూడా విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు లేవని వెంటనే సొంత గనులు ఏర్పాటు చేయాలని వారు అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన వెనక్కు తీసుకోవాలని లేనిపక్షంలో అన్ని విద్యార్థి యువజన సంఘాలను కలుపుకొని పోరాటం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం అనిల్ కుమార్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రసన్న అశోక్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షుడు భూషణం రాజేష్ ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రాము తదితర నాయకులు విద్యార్థులు యువజన సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

## ' వెల్దేవి గ్రామ మాజీ సర్పంచ్ పిల్లి సుందర్ అన్న కుమారుడు పిల్లి సతీష్ (23) మృతి



**అడ్డగూడూర్: అక్టోబర్1 (వార్త ప్రభ )**గత కొంతకాలంగా డెంగ్యూ వ్యాధితో బాధపడుతూ చనిపోయారు. పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన బి ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, వారి వెంట బి ఆర్ఎస్ నాయకులుబాలెంల అరవింద్ గూడెపు నరేష్, గజ్జెల్లి రవి,సోమయ్య , పిల్లి గంగయ్య, పరమేష్, కూతటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలి

### తెలంగాణ గ్రామ పంచాయతి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి డిమాండ్

**మహబూబాబాద్ అక్టోబర్ 1(వార్తా ప్రభ)**తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండ్ల అప్పి రె మాట్లాడుతూ మహబూబాద్ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ రెండవ పి ఆర్ సి నీ వర్తింపజేయాలని సెప్టెంబర్ నెల వరకు పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వాలని మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని కార్మికులందరికీ దసరా పండుగకు రెండు జతల బట్టలు ఇవ్వాలని ప్రతి నెల కార్మికులకు ఒంటి సబ్బులు బట్టల సబ్బులు కొబ్బరినూనె బెల్లం ప్రతినెల ఇవ్వాలని కార్మికుల అందరికీ పది లక్షల ఇన్సూరెన్స్ బీమా సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని వేతనానికి ప్రత్యేక గ్రాండ్ రిలీఫ్ చేయాలని 51 జీవాన్ని సవరించాలని కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలని ప్రమాదం సొత్తు మరణిస్తే కార్మికులకు 20 లక్షలు ఎక్స్గ్రేషియా కార్మికుల కుటుంబానికి అందజేయాలని గ్రామపంచాయతీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని అందరినీ పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారికి మంగళవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. పై డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయని యెడల సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెలోకి వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొల్లం ఎల్లయ్య రామకోటి ముదాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అమర హాస్పటల్ నందు ఘనంగా ప్రపంచ హృదయ దినోత్సవ వేడుకలు

**తిరుపతి :అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):** ప్రముఖ మల్టిస్పెలిటీ హాస్పటల్ అయిన తిరుపతి అమర హాస్పటల్ నందు ప్రపంచ హృదయ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి.ఇందులో భాగంగా అనేక రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరియు రోగులకు ప్రపంచ హృదయ దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు,ఇందులో భాగంగా తిరుపతి అలిపిరి బైపాస్ రోడ్ నందు అమరా హాస్పిటల్ ఆధ్వర్యంలో లో , "యూజ్ హార్ట్ ఫర్ యాక్షన్" అనే థీమ్ను ఉపయోగించి 5కె "వాకథాన్" ఈవెంట్ను నిర్వహించింది.నగరంలో గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడం కోసం, ఈ హృదయ ఆరోగ్య అవగాహన "వాకథాన్" అలిపిరి నుండి జూ పార్క్ వరకు నిర్వహించబడింది. దీనిని అమర హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి, కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకట శివకృష్ణ,డాక్టర్ మోహన్, ఆర్థోపెడిక్స్ %౦% మోకాళ్ల మార్పిడి సర్జన్ డాక్టర్ రవికుమార ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరినేని మాట్లాడుతూ " భారతదేశంలో ముఖ్యంగా తిరుపతిలో గుండె జబ్బులు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయి. అనారోగ్యకరమైన జీవనశైలి ఎంపికలు భారతీయ జనాభాలో మధుమేహం మరియు రక్తపోటు ప్రమాదాన్ని పెంచాయి, వారిని గుండె సంబంధిత వ్యాధులకు గురిచేస్తున్నాయి. ఈ వ్యాధి తీవ్రతను మనం గమనించి, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తక్షణ నివారణ చర్యలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైంది. కావున ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశం తో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు" ఈ కార్యక్రమంలో తిరుపతి పట్టణ ప్రజలు మరియు సమీప ప్రాంతాల ప్రజలు , అమరాజా కంపెనీ వంటి అనేక ప్రముఖ సంస్థలు నుండి ఔతహికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు.



# దళిత బహుజను ల స్మశాన వాటికను కాపాడండి -సతీష్ మాదిగ...

## స్మశాన వాటికను కాపాడాలని ప్రయత్నిస్తే దాడికి పాల్పడిన కబ్జాదారులకు సంబంధించిన ముస్లింలు



**కూకట్ పల్లి, అక్టోబర్ 1: అక్టోబర్1(వార్తాప్రభ):**కూకట్ పల్లి నియోజకవర్గం బాలనగర్ డివిజన్ ఇంద్రానగర్ లోని కబ్జాకు గురైనటువంటి దళిత బహుజనుల స్మశాన వాటికను పరిశీలించేందుకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర మాదిగ దండోరా వ్యవస్థాపక, అధ్యక్షులు సతీష్ మాదిగ ని అడ్డుకున్న దుండగులు. స్థానిక నివాసులు దళిత బహుజనులు స్మశాన కబ్జా చేస్తున్నారని ప్రశ్నిస్తే దాడికి పాల్పడిన ముస్లిం సోదరులు. అన్యాయంగా స్మశాన వాటికను కబ్జా చేస్తున్నారని ఇదేంటని ప్రశ్నిస్తే వారిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలానగర్ పోలీస్ స్టేషన్ లో దాడికి పాల్పడ్డ వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని సీఐ నవీన్ కుమార్ కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు స్థానికులు అందచేశారు.

# నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన ఏఈఓలు



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):** సుజాతనగర్ రైతు వేదిక నందు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపిన భద్రాద్రి జిల్లా ఎఈవో జేఏసీ అధ్యక్షుడు బి.నరసింహారావు, ఏఈఓలుకేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన డిజిటల్ క్రాప్ సర్వే క్లస్టర్ మొత్తం ఒక ఏ ఈ ఓ చేయటం కష్టతరమైనదాని తెలిపారు. ప్రతి క్లస్టర్ కి 5000 ఎకరాలు ఉండాలి అనే నిబంధన ఉంది కానీ భద్రాద్రి జిల్లాలో 45 క్లస్టర్లల్లో 5000 పైనుంచి 29000 ఎకరాల విస్తీర్ణం ఉ ందని కేంద్రం డీ సీ ఎస్ సర్వే కొరకు ఆర్థిక సాయాన్ని కూడా అందిస్తుంది కాబట్టి బడ్జెట్ తో ప్రతి గ్రామానికి ఒక సహాయకుడిని నియమించడానికి వీలుపడుతుంది అన్నారు వేరే రాష్ట్రలలో డీ సీ ఎస్ సర్వే కోరకు గ్రామ సహాయకులు ద్వారా చేస్తున్నారని ప్రతి గ్రామానికి గ్రామ సహాయకుడిని నియమించాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు సమస్యలు విన్నవించినా ఇంకా పరిష్కారం చూపకుండా ఏ ఈ ఓ లపై డీ సీ ఎస్ సర్వే కొరకు ఒత్తిడి చేస్తూ, గత 3 రోజులుగా (శుక్రవారం, శనివారం, సోమవారం) మేమూ డ్యూటీకి అటెండ్ అయిన సరే ఆబ్సెంట్ వేయడము జరుగుతుంది అన్నారు దీనికీ నిరసనగా మంగళవారం జిల్లా లోని వ్యవసాయ విస్తరణ అధికారులు అందరు రైతు వేదిక లో నల్ల బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరవడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ లు , శరత్, ప్రనూష పాల్గొన్నారు

# ఘనంగా మొదలైన బతుకమ్మ వేడుకలు



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 1 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ పద్మా నగర్ ఫేజ్ 2 రోడ్ నెం 21 సృష్టి నివాస్ అపార్ట్మెంట్ లో భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో మహిళలు అందరు కలిసి బతుకమ్మ యొక్క ప్రాముఖ్యతను అందరికీ తెలిసేలా వివరిస్తూ ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మాజీ ఉపరాష్ట్రపతి తో నిమ్మరాజు

**గుంటూరు, అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రముఖ తత్వవేత్త ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి వేడుకలు సోమ, మంగళవారం ఎంతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను ప్రారంభించిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ను సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయం ప్రారంభం నుంచి అనేకానేక వార్తా కథనాలు రాయడం తన అదృష్టం గా చెప్పారు. ఇక్కడ పనిచేసిన పలువురు గురుదేవులు, అలాగే చదివిన విద్యార్థులతో నేటికీ సన్నిహిత సంబంధాలు ఉన్నాయని నిమ్మరాజు తెలిపారు. పర్యావరణ విభాగంలో గురుదేవునిగా పనిచేస్తున్న తన మిత్రుడు డాక్టర్ శశిధర్ ను నాయుడుకు పరిచయం చేశారు. 1988లో నాటి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించారు వీరి పర్యటనలో నాటి విసి జివి జగన్నాథరాజు, ఐఏఎస్ అధికారి సతీష్ చంద్ర, సీనియర్ జర్నలిస్ట్ చలపతిరావు (ఆంధ్రపత్రిక) పాల్గొనడం జరిగింది.



# ఘనంగా క్యాపిటల్ విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే వేడుకలు...




**జగద్గిరిగుట్ట అక్టోబర్ 1 (వార్తాప్రభ)** క్యాపిటల్ విద్యాసంస్థలకు చెందిన ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం జీడిమెట్ల హెచ్ఎఎల్ కాలనీ న్యూ సిటీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాలానగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. హనుమంతరావు, ఇండియన్ ప్లే బ్యాక్ సింగర్ ఎం. ఉష పొలిటికల్ అడ్వైజర్ ప్రైమ్ నైన్ న్యూస్. డి వివి సత్యనారాయణ. కళాశాల చైర్మన్. డాక్టర్ దాయక సత్యనారాయణ. విద్యాసంస్థల చైర్మన్. టి.హేమలత. అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ. విద్యార్థులందరూ తెలివితేటలు నైపుణ్యాలతో పాటు శరీరక దృఢత్వం పెంపొందించుకొని. మంచి ఉద్యోగాలు సంపాదించాలని. దేశ అభివృద్ధికి పాటుపడాలని. తమ తల్లిదండ్రులు కలలు కన్న కలలును నిజం చేయాలని. కళాశాల అధ్యాపకులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని. విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం. గాయని ఉష. తన పాటలతో విద్యార్థులందరికీ ఫుల్ జోష్ తీసుకొచ్చారు. వారు పాడే పాటలకు విద్యార్థులందరూ.నృత్యాలు చేశారు. డి వివి సత్యనారాయణ.మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో విద్యార్థుల ప్రాముఖ్యతను వివరించారు.డైరెక్టర్. టి.హేమలత మాట్లాడుతూ. విద్యార్థులు ఇంటర్ తో పాటు డిగ్రీ తో పాటు పీజీ లో కూడా మంచిగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని. విద్యార్థులకు సూచించారు. కళాశాల చైర్మన్. డాక్టర్ దాయక సత్యనారాయణ. మాట్లాడుతూ. క్యాపిటల్ విద్యాసంస్థలో చదివే విద్యార్థులందరూ. మంచి ఉత్తీర్ణతతో పాటు. మంచి ఉద్యోగ కల్పన తమ ప్రాధాన్యంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో. విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలు అలరించాయి చివరగా బతకమ్మ పాటలకి ఆటపాటలతో దసరాకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో. కళాశాల ఉపాధ్యాయులు. విద్యార్థిని విద్యార్థులు. తల్లిదండ్రులు.తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయి కి ఎదగాలంటే అవకాశాలను అందిపుచ్చుకోవాలి

## హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యా సంస్థల ఈ ఓ డాక్టర్ వీ నారాయణరావు




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి )**విద్యార్థులు కళాశాలలో ఉన్న సదుపాయాలను అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగటానికి కృషి చేయాలని హిందూహైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వీ నారాయణరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాలలో కొత్తగా డిగ్రీలో చేరిన విద్యార్థులకు 'దీక్షారంబ్' పేరుతో పరిచయ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ సుమారు ఆరు దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన విద్యాసంస్థగా కేబీఎన్ కళాశాల విజయపథంలో ముందుకు సాగుతుందన్నారు. అటానమస్, నాక్ ఏ డబుల్‌ప్లస్ గ్రేడ్‌తో రాష్ట్రంలో ఉన్న పెద్ద కళాశాల్లో ఒకటిగా కేబీఎన్ కళాశాల ఉందన్నారు. దీనిలో సీటు పొందిన విద్యార్థులను అభినందించారు. అలాగే వివిధ విభాగాల నుంచి అందే సేవలను, సదుపాయాలను వివరిస్తూ వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే క్రీడా, సారస్వత, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ద్వారా అదనపు అర్హతలను సంపాదించాలని సూచించారు. వాటితో పాటుగా అనదపు డిప్లొమో వంటి కోర్సులను చేయటం ద్వారా మరిన్ని విజయాలను సాధించవచ్చని వివరించారు. అదేవిధంగా క్రమశిక్షణ, ఆడపిల్లల భద్రత అంశాల్లో రాజీపడమని, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సీనియర్ అధ్యాపకులు కే ప్రకాష్, బీవీ మనోహర్‌బాబులు అటానమస్ విధానంలో పరీక్షలు, మార్కులు, గ్రేడ్లు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ తదితరులు ప్రసంగించారు.

# ఇసుక క్వారీలను తక్షణమే తెరిపించాలి, ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి

## భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్ టియు, బిల్డింగ్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (బిసి డబ్ల్యాయు) సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన పిలుపు




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇసుక క్వారీలను తెరిపించి అందరికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని,భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును యధావిధిగా అమలు చేయాలని డిమాండు చేస్తూ భవానిపురం తహశీల్దారు కార్యాలయము వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాని ఉ ద్దేశించి బిసి డబ్ల్యాయు జిల్లా సహాయ కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా 45 రకాల వృత్తులలో 35 లక్షల మంది కార్మికులు ఈ రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు గడిచిన ఐదు సంవత్సరాలే కాకుండా ప్రస్తుతం కూడా పని చేసే చోట ఇసుక అందుబాటులో లేక పనులు కోల్పోయి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికుడుపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితుల్లో ఈరోజు భవన నిర్మాణ రంగం ఉంది. గత ప్రభుత్వం అమ్మిన రేటు కంటే ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం అదనంగా రెండు వేల రూపాయలు ఇసుకపై పెరిగింది అన్నారు. కొత్తగా కొలువు తీరిన ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులకు ఇసుక ఉచితంగా ఇచ్చి వారికి జీవనోపాధి చూపిస్తామని చెప్పి భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులకు ఆశలు నింపి అధికారంలోకి వచ్చి ప్రభుత్వం 100 రోజులు గడుస్తున్నా ఇసుక అందని ద్రాక్షగా మారిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఇసుక రీచ్ లన్నీ తెరిచి అందరికీ అందుబాటులో ఇసుక ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని ఎన్నికల ముందు ఇచ్చిన హామిని నిలబబెట్టుకోవాలని అయన ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం లక్షలాదిమంది కార్మికులు అనేక సంవత్సరాలు పాటు సుదీర్ఘ కాలం పాటు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డుని నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వ విధానాలు వున్నాయన్నారు. సంక్షేమ బోర్డులో అమలు చేసే సంక్షేమ పథకాలను కార్మికులకు అందే పరిస్థితుల్లో ఈరోజు సంక్షేమ బోర్డు లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మద్యంపై ఉన్న ప్రేమ ఇసుక విడుదల చేయటం పై లేకపోవడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు నిలుపుదల చేసేందుకు ఇచ్చిన 1214 సర్కులర్ను రద్దుచేసి ఐదు సంవత్సరాలుగా ప్రమాదాల బారిన పడ్డ కార్మికులకు ఇవ్వవలసిన నష్టపరిహారం తక్షణమే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమములో ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ బాజీ, బ్రహ్మయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖ పై అభ్యంతరకర పోస్టులకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన

## శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావుల దిష్టిబొమ్మలు దగ్ధం

## ఫోటోలపై మహిళలు చెప్పుతో కొడుతూ దిష్టిబొమ్మలు దగ్ధం చేసిన మహిళా కాంగ్రెస్ నేతలు



**కూకట్ పల్లి,అక్టోబర్1(వార్తాప్రభ):**రాష్ట్ర దేవాదాశాఖ మంత్రి కొండా సురేఖ పై బిఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని టెంపుల్ బస్ స్టాప్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావుల దిష్టి బొమ్మలు దగ్ధం చేశారు. పెద్ద ఎత్తున మహిళలు అక్కడికి చేరుకొని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్ రావు ల దిష్టిబొమ్మలు దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డితో పాటు మహిళా నేతలు మాట్లాడుతూ తెలంగాణ బీసీ ఆడబిడ్డ తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు కొండా సురేఖకు రఘునందన్ రావు (బీజేపీ ఎంపీ మెదక్ )మెడలో దండ వేశాడని కళ్యాణ్ లక్ష్మి డబ్బులు ఇచ్చారా అని ఎగతాళి చేసి అవమానించిన కేటీఆర్, హరీష్ రావు దిష్టిబొమ్మల దహన సంస్కారం చేసినట్లు తెలిపారు. అంతేగాక వారికి ప్రజలు రాజకీయ గోరికట్టిన బుద్ధి రాలేదని, అందుకే వారికి రాజకీయ సంతాపం తెలిపినట్లు తెలిపారు. తెలంగాణ బడుగు బలహీనవర్గాల జరిగిన మహిళా అవమానానికి మహిళలు టిఆర్ఎస్ నేతలను చెప్పుతో కొట్టే పరిస్థితి వచ్చిందన్నారు. కెసిఆర్, హరీష్ రావుకేటీఆర్ లు బడుగు బలహీన వర్గాల ఆగ్రహానికి గురి కావద్దని హెచ్చరించారు. మహిళల గురించి బలుపు మాటలు మాట్లాడి ఓడిపోవడం జరిగిందనీ ఓడిపోయిన సిగ్గు శరం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫణింద్ర, రేష్మ, డివిజన్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్,మేకల మైకల్, లక్ష్మీనారాయణ, నల్లికాంత్, రాజ ముదిరాజ్, శ్రీకాంత్ గుప్తా, శ్రీధర్ చారి, సోను, సతీష్, మహిళా డివిజన్ నాయకురాలు సంధ్య, పొన్నం రజిత, జోజమ్మ, మారుతి, యమునా,సుందరి, విజయలక్ష్మి, మమత, రమ్య,మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులను సత్వరమే పరిష్కరించండి-.ఎమ్మెల్యే కృష్ణారావు



**కూకట్ పల్లి,అక్టోబర్1(వార్తాప్రభ):**కూకట్ పల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై మంగళవారం జి హెచ్ ఎం సి కార్యాలయంలో కమిషనర్ ఆమ్రపాలితో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లతో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్, పెండింగ్ వర్క్ తోపాటు, రోడ్డు విస్తరణ పనులు ఫ్లై ఓవర్ నిర్మాణాలు చేపట్టాల్సిన వాటిపైన సమావేశంలో చర్చించి కమిషనర్ ఆమ్రపాలికి వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఆడిన విద్యార్థినిలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):** సుజాతనగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో దసరా సెలవుల నేపథ్యంతో విద్యార్థినిలలతో బతుకమ్మ సంబరాలను పాఠశాల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఆటపాటలతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు వివిధ రకాల పుష్పాలతో బతుకమ్మలను సర్వాంగా సుందరంగా అలంకరించి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు , సహోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# "రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జూనియర్ లైన్మెన్ కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన" చిత్తలూరి రవీందర్



**అడ్డగూడూర్: అక్టోబర్ 1 (వార్త ప్రభ** అడ్డగూడూర్ మండల పరిధిలోని చిర్ర గూడూరు గ్రామానికి చెందిన జూనియర్ లైన్మెన్ రోడ్డు యాక్సిడెంట్ లో తీవ్రంగా గాయపడి హాస్పిటల్లో గత కొన్ని నెలలుగా చికిత్స పొందుతూ మృతి చెందిన మోసిన్ పాషా నిరుపేద కుటుంభానికి ఆర్థిక సాయం చేయడానికి ముందుకు వచ్చిఈ రోజు10 వ రోజు సందర్భంగా చిత్తలూరి రవీందర్ (ఎక్స్ సర్వీస్ మెన్( ఐ ఏ ఎఫ్) గా తన వంతు సహాయంగా రూ?5000/- ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి సందర్భాలలో నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అప్పుడు ఉంటాయని అన్నారు ఈ కార్యక్రమంలో కుంభం యాదగిరి,చిత్తలూరి సాయికృష్ణ,కమ్మంపాటి రాజు,బండి వెంకన్న,కమ్మంపాటి నాగరాజు,ముద్దరబోయిన నాగన్న, పెండెం గణేష్ , కూటికంటి అన్నమయ్య ,చిత్తలూరి శివకృష్ణ,చౌగోని అరుణ్ .తదితరులు పాల్గొన్నారు.

# ఉదయం 6 గంటలకే అవ్వ, తాతల ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ - సకూరి ధనుంజయ రెడ్డి





**చంద్రగిరి : అక్టోబర్ 1, ( వార్త ప్రభ ప్రతినిధి ):**రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసి పేద వారికి ఆసరాగా నిలుస్తోందని, ఎక్కడ చూసినా అధికారులు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి ఉదయాన్నే పెన్షన్లు పంపిణీ ఇస్తున్నారని ప్రభుత్వం పట్ల పెన్షన్ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని నిరాశ్రయులకు పెన్షన్ పంపిణీ చేయడం ఆనందాన్ని కలిగించిందని టిడిపి నాయకులు సకూరి ధనుంజయ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సకూరి ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం నుండి పెన్షన్ దారులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించామని ఆయన తెలిపారు. కక్షపూరితమైన రాజకీయాలకు తావు లేకుండా ఎమ్మెల్యే పులివర్తి నాని చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నారని అందరూ సహకరించాలని ఆయన కోరారు. అనంతరం టిడిపి యువ నాయకులు కడియాల రవితేజ యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అడ్డగోలు పాలనతో చేసిన అప్పులు ఒక పక్క భయపెడుతున్నా, ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్ దారులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ పెంచి అందిస్తున్నామని గుర్తు చేశారు. వాలంటీర్లు లేకపోతే ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం సాధ్యం కాదన్న విషయాన్ని సుసాధ్యం చేస్తూ లబ్ధిదారులకు పింఛన్లు అందించి ఇది మాటలు ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని నిరూపించినట్లు ఆయన అన్నారు.ఆనాడు నందమూరి తారక రామారావు పేదల కోసం పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టిన విధానాన్ని అంచలంచలుగా నగదును పెంచి 4000 రూపాయలు మరియు 6000 రూపాయలు, ఆరోగ్యం పూర్తిగా క్షీణించి బెడ్ మీద ఉన్న వాళ్ళకి 10000 రూపాయలు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న ఈ ఆర్థిక సహాయ సహకారాలకు ప్రజల దీవెనలు అందుతున్నాయి అని కొనియాడారు. గ్రామంలోని కూటమి నాయకులు, సచివాలయం అధికారులతో కలిసి పంచాయతీలోని లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లోకనాథం , లీలా కృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చర్చ్ ఆఫ్ క్రైస్ట్, దూలాస్ ఫ్యామిలీ ట్రస్ట్ ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ



**నందిగామ,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** విద్యార్థులు చిన్నతనం నుండే ఎదుటివారికి సహాయపడే మనస్తత్వం కలిగి ఉండాలని దూలాస్ ఫ్యామిలీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పగిడిపల్లి మణిఆనంద్ ప్రెసిడెంట్ డాక్టర్ పగిడిపల్లి దేవ సహాయం అన్నారు మంగళవారం నాడు వరద బాధితుల సహాయార్థం గోల్డెన్ బర్డ్స్ దోలాస్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల చేత వరద బాధితులకు దాదాపు 200 మంది కుటుంబాలకు నిత్యవసర సరుకులు, కూరగాయలు చిన్నారుల చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పగిడిపల్లి మాట్లాడుతూ ఇటీవల తుఫాను బీభత్సం వలన పేద ప్రజలు ఎంతోమంది అధిక వరదల వల్ల కుటుంబ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఈ నేపథ్యంలో ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలనే తలంపుతో తమ ట్రస్టు ద్వారా చర్చ్ ఆఫ్ క్రీస్తు నందిగామ సంయుక్త ఆధ్వర్యంలో వరద బాధితులకు సహాయం చేయడం జరిగిందని విద్యార్థుల చేత సహాయం చేయించడం వల్ల భవిష్యత్తులో వారు కూడా దానగుణం అలవర్చుకొని ఎదుటివారికి సాయపడే విధంగా వారి యొక్క ఆలోచన విధానాన్ని అవలంబించుకుంటారని కనుకనే నేడు చిన్నారుల చేత పంపిణీ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక జిల్లాలలో వరద బాధితులకు ట్రస్టు ద్వారా సహాయం చేయడం జరిగిందని రానున్న రోజుల్లో భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా మరి కొంతమందికి వరద బాధితులకు సహాయం చేయటానికి రూపకల్పనలు చేస్తున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పగిడిపల్లి మణి ఆనంద్ ప్రెసిడెంట్ డాక్టర్ పగిడిపల్లి దేవ సహాయం, పగిడిపల్లి నాని రత్న వినోద్, జ్ఞాన వర కుమార్, పోపూరి మృత్యుంజ రావు దామ శిలామణి తదితరులు పాల్గొన్నారు.

# కొల్లూరు చిన్నాకు మరో గౌరవ డాక్టరేట్



**పెడన,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్), కొల్లూరి చారిటబుల్ ట్రస్ట్ (కెసిటి) వ్యవస్థాపకులు పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా మరో గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. డేస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ (యూఎస్ఏ) గాడ్ సన్ హోలీ స్పిరిట్ థియోలాజికల్ అకాడమీ వారు విశాఖపట్నం, జిల్లా పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో గాడ్ సన్ హోలీ స్పిరిట్ మినిస్ట్రీస్ గాడ్ సన్ హోలీ స్పిరిట్ థియోలాజికల్ అకాడమీ చైర్మన్ అండ్ డైరెక్టర్ డా.ఎం వి ప్రసాద్ వైస్ చైర్మన్ శ్యామ్సన్ భారతీయ యాదవ మహాసభ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు డా. నమ్మి అప్పలరాజు, హై కోర్ట్ అడ్వకేట్ డా. జార్జ్ బంగారి తదితరులు గౌరవ డాక్టరేట్ అవార్డును డా. కొల్లూరి చిన్నాకు అందజేశారు. ఒక మధ్య తరగతి సామాన్య కుటుంబీకుడైన డా. కొల్లూరి గత నాలుగు దశాబ్దాలు పైగా పెడన పట్టణ మరియు పరిసర ప్రాంత పేద ప్రజలకు తన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను ఈ అవార్డును అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సామాజిక వర్గంలో సేవా రంగంలో రెండు డాక్టరేట్స్ అందుకున్న ఏకైక వ్యక్తి డా.కొల్లూరి కావడం విశేషం. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ, కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం. పెడన మండల ఆర్యవైశ్య సంఘం పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య య-ువజన సంఘం వాసవి క్లబ్ శ్రీ వాసవి మహిళా మండలి పెడన మండల హోల్ సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పట్టణ పుర ప్రముఖులు పలువురు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి చిన్నాను అభినందించారు.

# మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలి



**ఆగిరిపల్లి, అక్టోబరు 1 (వార్తాప్రభ) :** మధ్యాహ్న భోజనం కార్మికులకు వేతనాలు పెంచాలని, సిఐటియు జిల్లా కార్యదర్శి జి రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఆగిరిపల్లి లోని సుందరయ్య భవన్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు, ధరల పెరుగుదలకు అనుగుణంగా పిల్లలకు ఇచ్చే మెనూ చార్జీలు పెంచాలని సిఐటియు తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రతినెల ఆరవ తేదీ లోపు వేతన బిల్లులు ఇవ్వాలని, రాజకీయ నాయకుల వేధింపులతో కార్మికుల తొలగింపులు ఆపాలని, ప్రభుత్వమే వంట ఏజెన్సీ నిర్వహకులకు గ్యాస్ ను సరఫరా చేయాలని కోరుతున్నామన్నారు. కార్మికులకు కనీస వేతనంతో పాటు, మృతి చెందితే మట్టి ఖర్చులకు 5,000 రూపాయలు అంద చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా అందచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# మత్స్యకారులకు ఐస్ బాక్సుల అందజేత



**కృత్తివెన్ను, అక్టోబరు 1 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలం గర్షపూడి గ్రామం నందు మత్స్యకారులకు మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి కృషితో ఓ ఎన్ జి సి సంస్థ సి ఎస్ ఆర్ నిధులతో సమకూర్చిన ఐస్ బాక్సులను స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఎంపీ బాలశౌరి తో కలిసి మత్స్యకారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ మత్స్యకారులకు ఐస్ బాక్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆకాంక్షించారు. తమ ప్రభుత్వ పాలన వంద రోజులు పూర్తి చేసుకొని,ప్రజలకు తాము ప్రకటించిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అందిస్తూ వస్తున్నామని లబ్ధిదారులందరికీ అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తమది మంచి ప్రభుత్వం అని తమ పాలనలో అందరికీ మంచే జరుగుతుందని తెలిపి, ఐస్ బాక్సుల పంపిణీ కి గాను సహకారం అందించిన ఓఎన్జిసి సంస్థను అభినందించారు. తదనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతినెల మొదటి తేదీ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీ బాలశౌరి మరియు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ లు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉమ్మడి నేతలు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దీక్షకు మద్దతుగా గరికపాటి శివ శంకర్ పాదయాత్ర






**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** సనాతన ధర్మ పరిరక్షణ కు పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం అపవిత్రం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్ష కు మద్దతుగా హనుమాన్ జంక్షన్ శ్రీఅభయాంజనేయ స్వామి దేవస్థానం నుంచి విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయం వరకు జనసేన నేత జనసేన ఎలక్షన్ మీడియా కోఆర్డినేటర్ గరికిపాటి శివ శంకర్ ఆధ్వర్యంలో కూటమి పార్టీ శ్రేణులు పాదయాత్ర మంగళవారం ఉదయం హనుమాన్ ఆలయం నుండి ప్రారంభించారు. సుమారు 48 కిలోమీటర్ల మేరా సాగనున్న పాదయాత్ర కొనసాగుతుంది. ఈ పాదయాత్ర వీరవల్లి గ్రామం చేరుకున్న సంధర్భంగా వీరవల్లి తెలుగుదేశం, జనసేన నాయకులు తిరుపతమ్మ గోపయ్య ఆలయంలో పూజలు నిర్వహించి ఆయనకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు లంకా సురేంద్ర బెనర్జీ, లంకా అజయ్, ఆర్ గోపాలకృష్ణ, టిడిపి, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తున్న వ్యక్తి సీఎం చంద్రబాబు నాయుడు

● గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు





**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** నిరుపేదల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తున్న వ్యక్తి సీఎం చంద్రబాబు నాయుడు అని గన్నవరం నియోజక వర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు . మంగళవారం కృష్ణ జిల్లా బాపులపాడు మండలం ఎంజీ.నగర్ , తారకరామనగర్ , హనుమాన్ నగర్ ప్రాంతాల్లో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చేతుల మీదుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులైన అవ్వ తాతలకు, వికలాంగులకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నేరుగా ఇంటి ఇంటికి వెళ్లి పింఛన్ల ను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ పేదల ముఖంలో నవ్వు చూడాలని, వారి ఆర్థిక ఇబ్బందులను కొంతమేరకైనా తగ్గించాలనే లక్ష్యం తో సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. వితంతు, వృద్ధాప్య, దివ్యాంగులకు ఆర్థిక భరోసా ఉండేలా ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలులో భాగంగా పింఛన్ల మొత్తాన్ని పెంచినట్లు చెప్పారు. పెంచిన మొత్తాన్ని సకాలంలో వారికి అందించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని తిరిగి దేశంలోనే నెంబర్ వన్ స్థితికి తీసుకెళ్లాలన్న తపన తో చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కొత్తగా అర్హులను గుర్తించేందుకు చర్యలు తీసుకొంటున్నామని, గతంలో వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన వారి జాబితాను సమీక్షించి వారికి కూడా లబ్ది చేకూర్చే లా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గం లో అర్హులందరికీ పింఛన్లు అందించేందుకు కృషి చేస్తున్నట్లు యార్లగడ్డ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు వృద్దులకు యార్లగడ్డ తన సొంత నిధులనుండి నగదు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుట్టా సురేష్, వేగిరెడ్డి పాపారావు, చలమల శెట్టి రమేష్, చింతల వెంకట శివ అప్పారావు, ముల్పూరి సాయి కళ్యాణి, వీరమాచినేని సత్యప్రసాద్, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ , వేములపల్లి శ్రీనివాస్, గుండపనేని ఉమా ప్రసాద్, దన్నే దుర్గారావు, అట్లూరి శ్రీనివాస్, గార్లపాటి రాజేశ్వరరావు, చలసాని శ్రీనివాస్ , కూటమి నేతలు కార్యకర్తలు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనారోగ్యానికి గురైన మండల టీడీపీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు ను ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గోగినేని భాస్కరరావు చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# నేటి నుంచి వాసవి క్షేత్రములో దసరా మహోత్సవాలు



**పెడన,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము నందు 50వ సంవత్సర దసరా మహోత్సవములు ఘనంగా ప్రారంభం కానున్నాయి అని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా కొల్లూరి చిన్నా తెలియజేశారు. గురువారం భక్తులకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అలంకారంలో దర్శనం ఇవ్వనున్నారు. ఉదయం గం. 6-30 ని.లకు గో పూజ విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన పంచగవ్యం రక్షాబంధన దీక్ష ఋత్విక్ వరుణ అఖండస్థాపన త్రిశక్తి కుంభ సహిత నవదుర్గా కలశ స్థాపన, అర్చన అభిషేకం బాల భోగాది కార్యక్రమాలతో ప్రారంభం కానున్నాయి. ఉదయం గం.10-16 ని.లకు శ్రీ వాసవిదేవి హోమం. ముత్తైదువులు కన్యలచే సామూహిక లలిత సహస్ర నామ కుంకుమార్చనలు, నీరాజన మంత్రపుష్ప తీర్ధప్రసాద వితరణలు జరుగును, పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి వారిచే సాయంత్రం 6 గం.ల నుండి 8 వరకు 108 మంది సువాశినులుచే 108 సార్లు లలితా పారాయణం చదువబడును. ఆవాహన కలశములకు ప్రదోషకాలపూజ తమలపాకులు లిల్లిపుష్పాలు వాటితో విశేషపత్ర, పుష్ప పూజ విశేష ఫలనైవేద్యములు ముత్తైదువులచే అష్టాదశ జ్యోతులతో అమ్మవారికి పంచ హారతులు అనంతరం నీరాజన మంత్రపుష్పములు తీర్ధప్రసాదములు వితరణ. రాత్రి 7-00 గం.లకు కుమారి జుజ్జారు శరణ్య హైదరాబాద్ వారిచే కూచిపూడి నాట్యం కలదు అని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 3 నుండి 12 వరకు శ్రీ వాసవి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు తో పాటు పదిమంది రుద్వికలుచే అత్యంత భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని తెలియజేస్తూ పెడన పట్టణ మరియు పరిసర ప్రాంత భక్తులు ప్రజలందరూ విరివిగా విచ్చేసి శ్రీ వాసవి మాతను దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించి శ్రీ వాసవి మాత కృపకు పాత్రులు కాగలరని డా. కొల్లూరి చిన్నా విజ్ఞప్తి చేశారు.

# పరిసరాల పరిశుభ్రత జీవితంలో భాగం కావాలి

● స్వచ్ఛతా హీ సేవాలో యువత భాగస్వాములు కావాలి

● వి.ఎం.సి.అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్





**విజయవాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** పరిసరాల పరిశుభ్రత వ్యక్తి ఆరోగ్యానికే కాదు, దేశ భవిష్యత్తుకి కూడా అతి ముఖ్యమైనది అని విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత గురించి ఆలోచన ఉన్న వ్యక్తికి జీవితంలో క్రమశిక్షణకు అలవడటమే కాకుండా సమాజల గురించి కూడా బాధ్యత చేకూరుతుందనినాయన అభిప్రాయపడ్డారు. స్వచ్చతా హీ సేవా ఉద్యమం భవ్యమైన భారతదేశానికి దశ, దిశ నిర్దేశిస్తుంది అని అన్నారు. నాస్తికకేంద్రంలో ఏర్పాటైన స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. సభాప్రాంగణలో క్రిక్కిరిసిపోయిన యువతీ యువకులని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ యువతే భవిష్యత్తు దేశ నిర్మాతలని, స్వచ్చతా హీ సేవా కార్యక్రమాన్ని తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని అన్నారు. నగర విద్యార్థినీ విద్యార్థులు ముఖ్యంగా స్వచ్ఛ విజయవాడకి నడుం బిగించాలని ప్రత్యేకించి కోరారు. స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్ డాఎంసమరం మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న భారత దేశం సాకారం చేయవలసిన బాధ్యత మనందరి మీద ఉందని, 2047కి భారత దేశాన్ని అగ్ర దేశాల సరసన నిలబెట్టడం మన కర్తవ్యం అని అన్నారు. విజయవాడ మునిసిపల్ కార్పోరేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ– ఎన్టీఆర్ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా వ్యాసరచన పోటీల విజేతలకి, వ్యాసరచనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఈ సదస్సులో ముఖ్యఅతిధి చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెమెంటోలు ప్రదానం చేసారు. తొలుత డి. రవికుమార్ వందలాదిమందిగా హాజరైన విద్యార్థులకి స్వాగతం పలకగా, వాసవ్య మహిళా మండలి కార్యదర్శి రశ్మి వందన సమర్పణ చేసారు.

# దేవి రెడ్డి దత్త శ్రీ మనోజ్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు 100 భోజనం ప్లేట్లు పంపిణీ



**కంచికచర్ల,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** కంచికచర్ల మాజీ సర్పంచ్ దేవిరెడ్డి శివరాధ కుమారి కుమారుడు జనసేన నాయకుడు దేవిరెడ్డి శ్రీనివాసరావు శివ కుమారి దంపతుల కుమారుడు దేవిరెడ్డి దత్త శ్రీ మనోజ్ పుట్టిన రోజు సందర్భంగా కంచికచర్ల ప్రణితా కాలనీలో గల మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు 100 భోజనం ప్లేట్లు పంపిణీ అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు దత్త శ్రీ మనోజ్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవి రెడ్డి శ్రీనివాసరావు దంపతులు మాట్లాడుతూ మా కుమారుడు పుట్టిన రోజు పేదలకు ఏదోకటి చేయాలనే సంకల్పంతో ఉండగా విద్యార్థులకు భోజనం ప్లేట్లు అవసరమని తెలుసుకుని 100 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేయాలని ఆలోచన వచ్చింది అని పుట్టిన రోజుకు ఇతర వాటికి ఖర్చు పెట్టకుండా విద్యార్థులకు తన కున్న దానిలో ఎంతో కొంత ఇవ్వడంలో ఎంతో సంతోషం ఉంటుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఇతరులు కూడా స్ఫూర్తి గా తీసుకుని దాతలు పేద విద్యార్థులకు, పాఠశాల కు ఏదోఒక కార్యక్రమం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యాపకులు మాట్లాడుతూ పిల్లులకు భోజనం ప్లేట్లు ఇవ్వడం ఎంతో సంతోషం చ దగ్గ విషయమని .ఇలాంటి కార్యములకు ముందుకు వస్తున్న దాతలకు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు దేవిరెడ్డి శ్రీనివాసరావు శివ కుమారి, తోట ఓంకార్ జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు, నాయిని సతీష్ జనసేన మండల అధ్యక్షుడు,జనసేన నాయకులు, బందరుపల్లి సత్యనారాయణ,కంభంపాటి తిరుమలరావు,శినంశెట్టి బాలాజీ, నరసింహారావు, పాఠశాల ఉపాధ్యాయులు జి. బబితా,జోహషభా, లక్ష్మీ కుమారి,ప్రభు కిషోర్, కావటి ఆదినారాయణ,శాంత కుమారి,పద్మ, తదితరులు పాల్గొన్నారు.

### నూజివీడు మండలం అన్నవరం హనుమంతుల గూడెంలో
# పొలం పిలుస్తుంది కార్యక్రమం..




**నూజివీడు,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** నూజివీడు మండలం అన్నవరం హనుమంతుల గూడెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి మరియు పొలం సందర్శన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో అధికారులు రైతులతో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఖర్చు తగ్గించుకొని అధిక లాభాన్ని పొందడం మరియు మామిడి సాగులో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించడం జరిగింది, రైతులు పలు సందేశాలను నివృత్తి చేయడం జరిగినది, వ్యవసాయ యాంత్రీకరణ వలన సాగు ఖర్చులు కూలీల ఖర్చులు తగ్గించుకునేందుకు ఎలాంటి చర్యలు గైకోనాలని చర్చాగోష్ఠ జరిగినది. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల వ్యవసాయ అధికారి చాముండేశ్వరి, నూజివీడు డివిజన్ సహాయ వ్యవసాయ సంచారకులు విద్యాసాగర్, మరియు నూజివీడు మండల ఉద్యాన శాఖ అధికారి, మామిడి పరిశోధన శాస్త్రవేత్త శాలి రాజు మరియు ఇతర అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడాకారులకు బహుమతులు..




**నూజివీడు,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** నూజివీడు నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన మండల, నియోజకవర్గ ఆటల పోటీల సెలక్షన్స్ లో శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లి విద్యార్థినీ విద్యార్థులు సెలెక్ట్ అయినారని పాఠశాల ప్రధానోపాధ్యాయని పి.రాధికారాణి తెలిపారు. కబడ్డీ ,ఖోఖో, యోగా, బ్యాడ్మింటన్ అండర్ 14 విభాగములో, అండర్ 17 విభాగంలో హర్ష,దేవత్రినాథ్, సాయిహర్ష ,రుషి, రాజ్ కుమార్ ,సంతోష్ ,జగదీష్ ,కిరణ్, దివ్యరాణి,నందిని, మేఘున సెలెక్ట్ అయినారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు జూనియర్ కబడ్డీ, ఖోఖో విభాగంలో నందిని. సీనియర్ బాలికల విభాగంలో కబడ్డి, ఖోఖో మేఘున సెలెక్ట్ అయినారని తెలిపారు అలాగే నియోజకవర్గ అద్లెటిక్స్ విభాగంలో డిస్కస్ త్రో వంశీ ప్రథమ స్థానము, 100 మీటర్ల పరుగు పందెం ఋషి ద్వితీయ స్థానం,400 మీటర్ల పరుగు సందెంలో విజయ్ కుమార్ తృతీయ స్థానం, జిల్లా స్థాయిలో జరిగే అద్లెటిక్స్ లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు బహుమతులను జీవశాస్త్ర ఉపాధ్యాయునులు దోమా విజయలక్ష్మి, శీలం విజయ్ మనోహరం బహుమతు లను స్పాన్సర్ చెయ్యడం జరిగినది.. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయ నీ ఉపాధ్యాయులు జల్దులక్ష్మి, కృష్ణవేణి, మల్లేశ్వరి సాకారవి, , మోహన్ రావు, బాలు, విఠల్ బాబు, కోటేశ్వరమ్మ, సౌజన్య, నాన్ టీచింగ్ సిబ్బంది వరలక్ష్మి, శిరీష, రంగారావు, నారాయణ పాల్గొన్నారు. విద్యార్ధినీ విద్యార్ధులకు తర్ఫీద్ నిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ రవీంద్రను మరియు క్రీడాకారులను అభినందించారు.

# ఏకత్వ పాఠశాలలో ఇత్సాహంగా దసరా సంబరాలు







**వీరులపాడు,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** మండలం పొన్నవరం గ్రామంలోని ఏకత్వ పాఠశాలలో మంగళవారం ఉదయం దసరా సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడపా నాగ సూర్యవతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సూర్యవతి మాట్లాడుతూ.. పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు సాంప్రదాయాలు, సాంప్రదాయ పండుగల ప్రత్యేకతలు వాటి విలువలను గురించి కూడా తెలుసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు నవదేవతల వేషధారణతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల ఫౌండర్ డైరెక్టర్ అమరనేని మనోజ్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందు ఉండాలని అందుకు పాఠశాల స్థాయి నుండి వారు విద్యాబుద్ధులను అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం చిన్నారులు బతుకమ్మ సంబరాలతో వినాయక అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ అమరనేని సింధూరా, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఐశ్వర్య సంబశివన్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నూజివీడు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సీఐగా మస్తానయ్య బాధ్యతలు స్వీకరించారు...



**నూజివీడు,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా నూజివీడు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ నందు ఏ మస్తానయ్య నూజివీడు ప్రొవిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్గా బాధ్యతలు స్వీకరించినారు .ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీలో భాగంగా 1 10 2024 నుండి 9 10 2024 వరకు ఆన్లైన్లో గాని ఆఫ్లైన్లో గాని నూజివీడు స్టేషన్ పరిధిలో మొత్తం 16 కొత్త మద్యం షాపుల కొరకు అప్లికేషన్లను స్వీకరిస్తారు.

# డ్రెయిన్ల వ్యవస్థపై ప్రత్యేక దృష్టి

- ముంపు సమస్య శాశ్వత పరిష్కారంలో భాగంగా చర్యలు
- రైల్వేతో ముడిపడిన అంశాల్లో పురోగతిపై ప్రతి నెలా సమావేశాలు
- విజయవాడ అర్బన్ పరిధిలో ఈ నెల 3, 4 తేదీల్లో ఉమ్మడి తనిఖీల నిర్వహణ
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ డా. జి.సృజన



**విజయవాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** ఇటీవల వరద ముంపుతో విజయవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారని.. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు, శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని, ఇందులో భాగంగా డ్రెయిన్ల వ్యవస్థపై దృష్టిసారించామని, ఈ నెల 3, 4 తేదీల్లో ఉమ్మడి తనిఖీలు నిర్వహించనున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జిల్లా కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు. మంగళవారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర.. విజయవాడ ఆర్‌డీవో కె.చైతన్య, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, రెవెన్యూ, మునిసిపల్, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులతో రైల్వేతో ముడిపడిన ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, ఎస్టేట్ సెక్షన్ల అంశాలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. కమిషనర్ ధ్యానచంద్ర పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ అంశాలను వివరించారు. డ్రెయిన్లలో పూడికతీత, పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు మ్యాన్‌హోళ్ల వద్ద తేలియాడే చెత్తాచెదారం తొలగింపు, సుందరీకరణ, సీసీ అప్రోచ్, ఆర్‌వోబీ/ఆర్‌యూబీల మంజూరు, నిర్మాణం, ఆక్రమణలు తదితరాలపై సమావేశంలో చర్చించారు. వర్షాల సమయంలో నీరు సజావుగా పారేందుకు వీలుగా డ్రెయిన్లలో పూడికను యుద్ధప్రాతిపదికన తీసేందుకు రైల్వేతో పాటు వివిధ శాఖల సమన్వయంతో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రైల్వే వంతెనల వెంట్స్ వద్ద ఉన్న అడ్డంకుల తొలగింపు, సీవరేజ్ పైపుల నిర్వహణపైనా చర్చించారు. విస్తృత ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ, రైల్వే అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాల్సి ఉందని ఎంపీ శివనాథ్ అన్నారు. అదే విధంగా రైల్వేతో సమన్వయం అవసరమైన పనుల్లో పురోగతిపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాల్సిన అవసరముందన్నారు. డీసిల్టింగ్, శానిటేషన్ తదితర పనులకు సంబంధించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) రూపొందించి, దానిప్రకారం పనులను త్వరితగతిన చేపట్టనున్నట్లు కలెక్టర్ సృజన తెలిపారు. సమావేశం అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో రైల్వేతో ముడిపడిన అంశాల్లో పురోగతి, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. నాలుగు ప్రధాన డ్రెయిన్లపై దృష్టిసారించామని, విజయవాడ అర్బన్ పరిధిలో రైల్వే, వీఎంసీ, ఆర్ అండ్ బీ, ఏపీసీపీడీసీఎల్, రెవెన్యూ అధికారులతో ఈ నెల 3, 4 తేదీల్లో, రూరల్ పరిధిలో ఈ నెల 7, 8 తేదీల్లో ఉమ్మడి తనిఖీలు నిర్వహించి, డ్రెయిన్ల స్థితిగతులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ప్రతినెలా సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మైలవరం శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రాయనపాడు, కొండపల్లి, ఈలప్రోలు తదితర ప్రాంతాలకు సంబంధించి ఆర్‌వోబీల ప్రతిపాదనలను సమావేశం ముందుంచినట్లు తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారంపై రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. సమావేశంలో నందిగామ ఆర్‌డీవో ఎ.రవీంద్రరావు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, రైల్వే, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, వీఎంసీ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## గుడివాడ ముఖ చిత్రాన్ని మార్చేందుకు.. నేను చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలి : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము..






**గుడివాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** పరిశుభ్రత పచ్చదనంతో కూడిన.. క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడ రూపకల్పనలో ప్రజలను చైతన్యపరిచేలా.. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి క్రియాశీలకంగా పనిచేయాలనీ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. వరల్డ్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా గుడివాడ లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి ఆధ్వర్యంలో డాక్టర్ గురురాజు ప్రభుత్వ హెూమియోపతి కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే రాము మంగళవారం ఉదయం ప్రారంభించారు. అనంతరం క్లబ్ సభ్యులు.. హెూమియో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే రాము కళాశాల ప్రాంగణంలో పూలు, పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాదు.. వాటి సంరక్షణకు కూడా స్వచ్ఛంద సంస్థలు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలని.. ముఖ్యంగా క్లీన్ గుడివాడ రూపకల్పనలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం అవుతూ.. ప్రజల్లో చైతన్యం నింపేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు పెద్దు శ్రీకాంత్, చేవూరు జగన్ మోహన్ రావు, పోలాసి ఉమా, హెూమియో హాస్పిటల్ సూపరిండెటెంట్ సుజాత, లయన్స్ ప్రగతి అధ్యక్షులు నల్లూరి శేషగిరిరావు, కార్యదర్శి అన్నే నవీన్, ఆర్.సి. యు. రాంబాబు, క్లబ్ జిల్లా నాయకులు డాక్టర్ భవాని శంకర్, రామదేని వేణుబాబు, సనక సుబ్బారావు, పామర్తి కేశవరావు, కె. చైతన్యకుమార్, మల్లంపల్లి వెంకట్రావ్, అన్నే నీరజ, ఆర్. మురళీధర్ రావు, మనోజ్ కుమార్ జైన్, మహంకాళీ వీరశేఖర్, అజయ్‌కుమార్, మాదాల సురేష్, బొప్పన కోటేశ్వరరావు, హెూమియో కళాశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అమర హాస్పటల్ నందు ఘనంగా ప్రపంచ హృదయ దినోత్సవ వేడుకలు

**తిరుపతి,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** ప్రముఖ మల్టిస్పెలిటీ హాస్పటల్ అయిన తిరుపతి అమర హాస్పటల్ నందు ప్రపంచ హృదయ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి.ఇందులో భాగంగా అనేక రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరియు రోగులకు ప్రపంచ హృదయ దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు,ఇందులో భాగంగా తిరుపతి అలిపిరి బైపాస్ రోడ్ నందు అమరా హాస్పిటల్ ఆధ్వర్యంలో లో , "యూజ్ హార్ట్ ఫర్ యాక్షన్" అనే థీమ్‌ను ఉపయోగించి 5కె "వాకథాన్" ఈవెంట్‌ను నిర్వహించింది.నగరంలో గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడం కోసం, ఈ హృదయ ఆరోగ్య అవగాహన "వాకథాన్" అలిపిరి నుండి జూ పార్క్ వరకు నిర్వహించబడింది. దీనిని అమర హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి, కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకట శివకృష్ణ,డాక్టర్ మోహన్, ఆర్థోపెడిక్స్ & మోకాళ్ల మార్పిడి సర్జన్ డాక్టర్ రవికుమార ప్రారంభించారు.

## ఎమ్మెల్యే రామును మర్యాదపూర్వకంగా కలిసిన గుడివాడ ఎక్సైజ్ సీఐ.. అధికారులు



**గుడివాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** ప్రజలందరికీ మంచి చేయాలన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమీ ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా.. ప్రజలకు మేలు చేసేలా అధికారులు పనిచేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. గుడివాడ ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన పి. వెంకటరమణ, గుడివాడ, నందివాడ ఎస్సైలుగా బాధ్యతలు చేపట్టిన హేమ సుష్మిత, ఆశాలతలు మంగళవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రామును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాఖపరమైన అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే రాము మాట్లాడారు.. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా.. విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే రాము తదితరులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాముకు అధికారులు పుస్తకాలు .. జ్ఞాపికాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ కి ఫైనాన్స్ ఆఫీసర్ గా డాక్టర్ నాగార్జున దేవి నియమితులయ్యారు



**నూజివీడు,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్ లో సిఎస్సి విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ నాగార్జున దేవి ఆర్జీయూకేటీ - ఏపీ కి ఫైనాన్స్ ఆఫీసర్ గా నియమితులయ్యారు. ఈమె గతంలో నూజివీడు క్యాంపస్ లో ఫైనాన్స్ ఆఫీసర్ గా మరియు డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ అధికారినిగా పని చేశారు. డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. అమరేంద్ర కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్. బి. లక్ష్మణ్ రావు మరియు నూజివీడు క్యాంపస్ లోని అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

## మానవతా గుడివాడ వారి కార్యక్రమాలు అభినందనీయం..



**గుడివాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** సెప్టెంబర్ నెల ఆఖరి సమావేశము ఆదివారం ఉదయం మానవతా ఆఫీస్ నందు నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యత్వాల నమోదు విషయమై మరియు ఇటీవల సంభవించిన బుడమేరు వరదలకు సంబంధించిన సహాయ కార్యక్రమాల గురించి చర్చించారు. అలాగే గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్ డా॥ వి. నవీన్ కుమార్ (బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీ) ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన విశిష్ట సేవల గురించి, ఆయన సేవా తత్పరత గురించి సభ్యులు కొనియాడినారు. అనంతరం హృద్రోగముతో బాధపడుతున్న డొకాల సరళ వేణి కి మందుల నిమిత్తం రూ. 5వేలు ఆర్థిక సాయం ఇవ్వడం జరిగింది. సమావేశంలో ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, సంస్థ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాల్, ఉపాధ్యక్షులు దండమూరి సీతారామస్వామి, కార్యదర్శి నందమూరి పద్మజ, మాజీ మున్సిపల్ చైర్మన్ లంక దాసరిప్రసాద్ మరియు బందారు రాధాకృష్ణ లు ప్రసంగించారు. సమావేశమునకు 30 మంది సభ్యులు హాజరవ్వగా.. మానవతా సభ్యులైన నాగేశ్వర శర్మ బావగారైన రాళ్ల బండి కామేశ్వరరావు చే అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

## నూజివీడు పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న గోవులు

- అదుపులోకి తీసుకున్నా పోలీసులు






**నూజివీడు,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** నూజివీడు పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న గోవులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మైలవరం సమీపంలోని చంద్రాల గ్రామంలో నుండి నంద్యాలకు గోవులను తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కానిస్టేబుల్ రాధాకృష్ణ, హెూంగార్డ్ వెంకటేశ్వరరావులు స్థానిక పెద్దగాని బొమ్మ సెంటర్ వద్ద గోవులు తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. పట్టణ సిఐ సత్య శ్రీనివాస్ గోవుల అక్రమ తరలింపు పై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రజలందరూ చైతన్యవంతులై ప్రభుత్వ సేవలను.. సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము





**గుడివాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్లో మంచి ప్రభుత్వం ఏర్పడిందని.. ప్రజలందరికీ మంచి చేయాలనే లక్ష్యంతోనే ఎన్డీఏ కూటమిపాలన సాగుతుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు, పెంజేంద్ర గ్రామాల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి ఎమ్మెల్యే రాము వినతులు, సమస్యల అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే రాము.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజా వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.. నేడు నిర్వహించిన ప్రజా వేదికలో ఇళ్ల స్థలాలు.. పెన్షన్ల సమస్యలపై ప్రజల నుండి అధికంగా వినతులు వచ్చాయన్నారు. ప్రజా వేదిక వినతుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే రాము తెలియచేశారు. ప్రజల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు గ్రామాల వారీగా డేటా రూపొందిస్తున్నామని.. ఇప్పటికే ఇళ్ల స్థలం పొందిన లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చి లోపు తమ గృహ నిర్మాణం పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. తప్పనిసరిగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి స్థలంతో పాటుగా.. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ జనసేన పార్టీ బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు చేవూరు జగన్ మోహన్ రావు, డోకిపర్రు గ్రామ టిడిపి నాయకులు శివప్రసాద్, సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ జ్యోతి, జోగి వెంకటేశ్వరరావు, పూరెల్ల శ్రీరాములు, చోరగుడి కోటేశ్వరరావు, జుజ్జువరపు మహా లక్ష్మణుడు, నాగలక్ష్మి, చిన్న, జానీ, పెంజేంద్ర నాయకులు బొప్పన్న శివప్రసాద్, సుభాన్ ఖాన్, రేమల్లి పెంటయ్య, షేక్ సంభాని, శోభన ప్రకాష్, ఇన్చార్జి తాసిల్దార్ లోవరాజు, ఏవో ఇమ్రాన్, హౌసింగ్ డిఈ నాయక్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ఎన్డీఏ కుటమి పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రోటరీ యువజనోత్సవాలు లో విద్యాలయ ముందంజ



**గుడివాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** సెప్టెంబర్ 17వ తేదీ నుండి 28వ తేదీ వరకు స్థానిక రాజేంద్రనగర్ లోని రోటరీ భవన్లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ వారి ఆధ్వర్యంలో జరిగిన రోటరీ యువజన ఉత్సవాలలో 9 క్యాటగిరిలో ప్రతిభా పరీక్షలు నిర్వహించగా అన్ని కేటగిరిలోను విద్యాలయ విద్యార్థులు పలు స్థానాల్లో బహుమతులు గెలుచుకొని డివిజన్ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో విద్యాలయ స్థానాన్ని ప్రథమంగా నిలిపారు. ఈ పోటీలలో విద్యాలయ చిన్నారి మూడేళ్ల ఆశ్రిత- నాలుగో తరగతి చిత్రలేఖనం విభాగంలో మొదటి బహుమతి, 9వ తరగతి విద్యార్థి తోట రేవంత్ బాబు సీనియర్ ఫోక్ డాన్స్ విభాగంలో ప్రథమ బహుమతి, ఎనిమిదో తరగతి విద్యార్థిని మన్నెం సాయి అక్షర విచిత్ర వస్త్రధారణ విభాగంలో ప్రథమ బహుమతి, జూనియర్ జానపద బృంద నృత్య భాగంలో కాగితఋష్వి, పామర్తి శ్రీనిజ ,బత్తుల హాసిని ప్రియ, కోరుపల్లి రూప్ రిషిత, మజ్జి జోషికామని, తుమ్మలచెర్ల దామిని శ్రీజ, సభావత్తుల శ్రీనిధి, ఓగిరాల గీతికా నాగసాయి ప్రథమ స్థానం పొందారు. వకృత్వ సీనియర్ విభాగంలో ఇందుకూరి నాగ సంజన 9వ తరగతి ద్వితీయ స్థానం, జానపద నృత్య బృంద విభాగంలో కసిరెడ్డి శీర్షిక, జువ్వనపూడి డీను రాయి, ఆకురాతి హరిచందన, వీరంకి యామిని, అట్లూరి తేజస్వీ, మన్నే భాను శ్రీ 9వ తరగతి విద్యార్థునులు ద్వితీయ స్థానం. విచిత్ర వస్త్ర వేషధారణ సబ్ జూనియర్ విభాగంలో మూడేళ్ల ఆశ్రిత నాలుగవ తరగతి మరియు జూనియర్ విభాగంలో కాగిత రుష్వి ఏడవ తరగతి ద్వితీయ స్థానం పొందారు. క్విజ్ విభాగంలో విద్యాలయ విద్యార్థులు- కుప్పిలి కృష్ణ మణికుమార్ పదవ తరగతి, జాస్తి హరిచందన 9వ తరగతి, ఇందుకూరి నాగ సంజన 9వ తరగతి, రాజా వినీల తొమ్మిదవ తరగతి విద్యార్థునులు తృతీయ స్థానం. స్పెల్బీ విభాగంలో సూరపనేని ధీరజ్ ఫణి 9వ తరగతి తృతీయ స్థానం. జానపద నృత్య బృంద సబ్ జూనియర్ విభాగంలో మూడేళ్ల ఆశ్రిత, ఉప్పల కాంక్ష, పల్లపోతు పద్మిని, కొండబోయిన సోని, నున్న శ్రీవల్లి జట్టు తృతీయ స్థానం మరియు వ్యాసరచన విభాగంలో 9వ తరగతి విద్యార్థిని బోడి పావని, ప్రోత్సాహక బహుమతి. వకృత్వ విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి ఈడే సాయి పునీత్, జానపద నృత్య సబ్ జూనియర్ విభాగంలో రెండవ తరగతి విద్యార్థిని నున్న శ్రీవల్లి. శాస్త్రీయ నృత్య బృంద విభాగంలో ఆరవ తరగతి విద్యార్థునులు సూరపనేని శాంభవి, రాములకొల్లు విస్వీత ప్రోత్సాహక బహుమతి. సీనియర్ జానపద నృత్య విభాగంలో పదో తరగతి విద్యార్థిని కసిరెడ్డి శీర్షిక ప్రోత్సాహక బహుమతి. విచిత్ర వేషధారణ విభాగంలో ఒకటో తరగతి విద్యార్థి కాగిత మోహిష్ రత్న, 9వ తరగతి విద్యార్థిని ఇందుకూరి నాగసంజన ప్రోత్సాహక బహుమతి. చిత్రలేఖన జూనియర్ విభాగంలో అడపా నితిన్ ఏడవ తరగతి ప్రోత్సాహక బహుమతులు పొందారు. మ్యూజికల్ చైర్ విభాగంలో మోరు హస్మిత పదవ తరగతి, ద్వితీయ బహుమతి, మన్నే భాను శ్రీ 9వ తరగతి తృతీయ బహుమతి ఈ పోటీల్లో పాల్గొని పథకాలు సాధించిన విద్యాలయ విద్యార్థులను విద్యాలయ స్కూల్ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్, శాంతి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం : డీ.హరినాథ్




**ఏలూరు జిల్లా,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా ముసునూరు మండలం రమణక్కపేట గ్రామంలో సచివాలయం ముందు సిపిఐ ఎంఎల్ లిబరేషన్, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా సిపిఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి హరినాథ్ పాల్గొని ప్రసంగిస్తూ ఎన్డీఏ భాగస్వామిగా తెలుగుదేశం జనసేన అధికారంలోకి వచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించడంలో వైఫల్యం చెందాయని ఆరోపించారు. సూపర్ సిక్స్ వంద రోజులు పాలనలో అమలు చేయకపోవడం చంద్రబాబు వైఫల్యం కాదా అని హరినాథ్ ప్రశ్నించారు. మీరిచ్చిన హామీలు అమలు చేయకుండా మంచి ప్రభుత్వం అని కితాబ్ ఇవ్వాలా అని హరినాథ్ ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న జమిలి ఎన్నికలపై మీ వైఖరి ఏమిటని ప్రశ్నించారు. నూతన మద్యం పాలసీ పేరుతో ప్రజల బలహీనతతో సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారని ఇది సరైనది కాదని సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలని హరినాథ్ డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం లో2 00 రోజులు పని కల్పించాలని రోజుకు 600 రూపాయలు కూలి ఇవ్వాలని హరినాథ్ డిమాండ్ చేశారు.రమణక్కపేట గ్రామంలో మూడు తరాల నుండి సాగు చేస్తున్న భూములను జాయింట్ కలెక్టర్ స్వయంగా పరిశీలించి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తుఫాను వల్ల దెబ్బ తిన్న రైతుల పంటలకు పూర్తి నష్టపరిహారం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ టీయూ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య, పామర్తి రామారావు, సర్వేసు, భవాని తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులు వ్యక్తులు కాదు.. ఉపయోగపడే వస్తువులు..

- ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా..
- వృద్ధుల సంక్షేమ సంఘం, గుడివాడ శాఖ ఆధ్వర్యంలో సమావేశం




**గుడివాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధుల సంక్షేమ సంఘం, గుడివాడ శాఖ వారీ ఆధ్వర్యంలో ఆహ్లాదకర వాతావరణంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం ఏజీకే స్కూలులో నిర్వహించారు. గుడివాడ శాఖ అధ్యక్షుడు బొగ్గవరపు తిరుపతయ్య ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి సీతారామయ్య గౌరవ అధ్యక్షులుగా పాల్గొని సమావేశానికి సారధ్యం వహించగా.. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు ప్రసంగిస్తూ.. వృద్ధులకు జీవన ప్రమాణము పెరగడానికి అవలంబించవలసిన కార్యాచరణ గురించి తెలియజేశారు. వృద్ధులు వ్యక్తులు కాదని ఉపయోగపడే వస్తువులని పలువురు వక్తలు స్పష్టం చేశారు. అలాగే వృద్ధుల సంక్షేమాన్ని గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా అత్యంత వయసు కలిగిన పత్తిపాటి రంగారావుని, పెద్దిరెడ్డి సీతారామయ్యని, తిరువీధి శ్రీరాములు ని, పూలబొకేలతో, శాలువాలతో జ్ఞాపికలతో ఉచిత రీతిన సత్కరించి గౌరవించారు. అలాగే వృద్ధుల సమస్యలు ప్రభుత్వానికి విన్నవించడానికి ఏకగ్రీవంగా తెలియజేయడము గూర్చి తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ దండమూడి సీతారామస్వామి, సెక్రటరీ చిన్నం గంగాధరం లు పాల్గొని సభను విజయవంతం చేసారు.

## డా॥ కె.కె.ఆర్ట్ గౌతమ్ స్కూల్ నందు "దసరా వేడుకలు"



**గుడివాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** స్థానిక డా॥ కె.కె. ఆర్ గౌతమ్ స్కూలు నందు కనకదుర్గాదేవి ని శాస్త్రోక్తముగా అష్టోత్తరనామముల తో పూజా కార్యక్రమము నిర్వహించబడినది. ఈ సందర్భముగా ప్రిన్సిపల్ లక్ష్మీప్రసాద్ విద్యార్థినీ విద్యార్థులకు మన సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేయుటకు ఇటువంటి కార్యక్రమములు విధిగా తమ విద్యా సంస్థలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మరియు ఉపాధ్యాయులు ఈ పండుగ విశిష్టతను, అమ్మవారి అవతారాల సారాన్ని విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేయటమైనది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్స్ సత్యారామ్, లక్ష్మీ ప్రసాద్, జ్యోతి, శ్రీమతి ప్రశాంతి, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రక్తదానం మీద అపోహలు వదిలి ప్రజలందరూ రక్తదానానికి ముందుకి రావాలి..



**గుడివాడ,అక్టోబరు 1 (వార్తాప్రభ) :** వరల్డ్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా మేరా యువ భారత్, యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రిత్వ శాఖ మరియు గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ సంయుక్తంగా జి.ఎం.ఇ.ఆర్.ఎస్ జనరల్ హాస్పిటల్, గాంధీనగర్, గుజరాత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ లో నిర్వహించారు. అక్కడే న్యాయశాస్త్రంలో పీ.హెచ్.డీ చేస్తున్నా గుడివాడ వాస్తవ్యులు లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ స్టేట్ లీగల్ వింగ్ కో-ఆర్డినేటర్ హేమంత్ కుమార్ అల్లూరి రక్తదానం చేసారు. ఇది తన తొమ్మిదవ రక్తదానమని ఈ సందర్భంగా మీడియా కి తెలియజేసారు. రక్తదానం మీద అపోహలు వదిలి గుడివాడ ప్రజలందరు రక్తదానానికి ముందుకి వచ్చి రక్తవసర ఉన్నా ప్రాణాల్ని కాపాడాలని కోరారు. గతంలో మా స్వచ్ఛంద సంస్థ రక్తదాన కార్యక్రమాలను నిర్వహించిందని మరియు వ్యక్తిగతంగా తాను అనేక రక్తదాన శిబిరాల్లో పాల్గొన్నానని తెలియచేసారు. అలాగే రోజురోజుకు కొత్త కొత్త రోగాలు వస్తున్నా తరుణంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188